RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 19 జూలై 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:44

## ఆహార, ఔషధాల్లో కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలి రేవంత్ రెడ్డి





ఆహార, ఔషధాల్లో కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, పాలు అన్నీ కల్తీ అవుతుండటంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (TGFAD-CA) పై ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తుండటంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి గారు తెలిపారు. ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగంతో పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు బయట పడుతున్నాయని, దీంతో కొన్ని దేశాలు దిగుమతులకు నిరాకరిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలు రకాల ఉత్పత్తులు విక్రయిస్తున్నారని, అధిక ధరలు చెల్లించి ప్రజలు వాటిని కొనుగోలు చేస్తున్నప్పటికీ అవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు సరైన వ్యవస్థలు లేవని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు అమలులో ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఆయా అధ్యయనాల ఆధారంగా సమగ్ర నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బిల్లును రూపొందించి శాసనసభలో సమగ్ర చర్చ చేపడతామని ముఖ్యమంత్రి తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా స్వీకరించాలని సూచించారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించేందుకు విజిల్ బ్లోయర్ వ్యవస్థను, టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కల్తీల నిరోధానికి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అక్కడ నిబంధనలను అమలు చేసి, వాటి అమలులో ఎదురయ్యే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ , ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి , ఎన్.శ్రీధర్ , వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అందెశ్రీ ఆశయాలే

## మా ప్రభుత్వానికి స్ఫూర్తి: రేవంత్

### అందెశ్రీ పాటే తెలంగాణ ఆత్మగౌరవం

### ఉద్యమ స్ఫూర్తికి చిరునామా అందెశ్రీ




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, జూలై 18:** తెలంగాణ కవి అందెశ్రీ తనకు ఆత్మబంధువని, ముఖ్యమంత్రిగా ప్రజల ముందుకు రావడానికి ఆయన స్ఫూర్తే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అందెశ్రీ స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఉద్యమ గీతాలతో తెలంగాణ సమాజంలో చైతన్యం నింపిన మహనీయుడు అందెశ్రీ అని కొనియాడారు.

ఇటుకపై ఇటుక పేర్చిన తాపీ మేస్త్రిగా జీవితం ప్రారంభించిన అందెశ్రీ, అక్షరాలను ఆయుధాలుగా మలిచి ఉద్యమ గీతాలు రచించారని అన్నారు. ఆయన రాసిన లి'జయ జయహే తెలంగాణ'లి గీతం రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందన్నారు. గత పాలకులు కుట్రపూరితంగా ఆ పాటను వినిపించకుండా చేసినా, నేడు ప్రతి పాఠశాలలో, ప్రతి గడపలో మారుమోగుతోందని తెలిపారు.

మిగతా 2లో

## 'భారత్‌ను గర్వపడేలా చేశారు'... విక్రమ్-1 సక్సెస్ తర్వాత స్కైరూట్‌కు మోదీ ఫోన్!





భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్-1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో మాట్లాడిన మోదీ.. "మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిలబెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు" అని అన్నారు. భారత యువతపై తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు.

మిగతా 2లో

## బోనాల జాతర వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన అనిల్ కుమార్ యాదవ్






**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** హైద్రాబాద్ జులై 18 :నగరంలో జరుగుతున్న జరుగుతున్న ఆషాడ మాస బోనాల జాతరకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నగర కార్యదర్శి సెటివిన్ మాజీ డైరెక్టర్ ఎస్.ధనరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన బోనాల పోస్టర్ ను రాజ్యసభ సభ్యులు ఎం .అనిల్ కుమార్ యాదవ్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల్లో ఒకటైన బోనాల పండుగ అన్నారు ఈ పండుగను హైద్రాబాద్ నగరం తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు పల్లె పల్లెల్లో ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు నగరంలో జరుగుతున్న ఈ బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలోS. ధన్‌రాజ్ & T. సతీష్‌శ్రీకాంత్ యాదవ్, డి. రాజ్ కుమార్, చంద్రమోహన్ యాదవ్, నగేష్ గౌకరన్ జీ, చిన్న నగేష్, ఆకాష్ సింగ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు

# రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

### శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి

### కూసుమంచి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి.

### 4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన.. చెక్కుల పంపిణీ

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై18 ప్రజాబలం:**ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని, అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి,జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండల పర్యటనలో భాగంగా మంత్రి, పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

మిగతా 2లో


ప్రజాబలం

19 జూలై 2026 ఆదివారం

# బ్రాండ్ భారత్ ....

కాంగ్రెస్ నిర్మించిన వ్యవస్థలు కేవలం ఒక దేశాన్ని నడిపితే.. బీజేపీ సృష్టిస్తున్న సంస్కరణలు ఒక అజేయమైన గ్లోబల్ బ్రాండ్‌ను ఆవిష్కరిస్తున్నాయి. వందేళ్ల తర్వాత దేశ చరిత్రను తిరగేస్తే.. కనిపించేది పాత పరిపాలనా పుటలు కాదు, సరికొత్తగా ప్రపంచాన్ని శాసిస్తున్న బ్రాండ్ భారత్ విశ్వరూపం!”బీజేపీ బ్రాండ్ ఆవిష్కృతమవుతోంది. అయితే ఈ బ్రాండ్ మత రాజకీయాలు లేదా హిందూత్వ రాజకీయాలు లేకపోతే ఆ పార్టీ భావజాలంతో సంబంధం ఉన్నది కాదు. ఓ కొత్త భారత దేశాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించబోతున్నారు. అందుకే ఈ పార్లమెంట్ సమావేశాలే సాక్ష్యం కానున్నాయి. నిన్నటివరకు కేవలం సదస్సులకో, మేధోమథనాలకో లేదా కేవలం రాజకీయ పార్టీల మేనిఫెస్టోలకో పరిమితమైన ఊహాజనిత సంస్కరణలు.. ఇప్పుడు ఆ ఊహల పరిధిని దాటి పార్లమెంట్ గడప తొక్కి చట్టరూపం దాల్చబోతున్నాయి. దేశ భవిష్యత్తును, భౌగోళిక-రాజకీయ స్వరూపాన్ని సమూలంగా మార్చేయగల సంచలన రాజ్యాంగ సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా పార్లమెంట్‌లో ప్రవేశపెడుతోంది. దశాబ్దాలుగా నత్తనడకన సాగిన వ్యవస్థాగత మార్పులకు తావులేకుండా, కాలంచెల్లిన సంప్రదాయాలను బద్దలు కొడుతూ నవభారత నిర్మాణానికి ఈ నిర్ణయాలు పునాది వేస్తున్నాయి.మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు, నియోజకవర్గాల శాస్త్రీయ పునర్విభజన, వన్ నేషన్ ? వన్ ఎలక్షన్, ప్రధాని, సీఎంలపై అనర్హత వంటి విప్లవాత్మక అడుగులు కేవలం చట్టపరమైన సవరణలు మాత్రమే కావు; అవి దేశ పరిపాలనా ముఖచిత్రాన్ని మార్చే సరికొత్త బ్రాండ్. నిరంతర ఎన్నికల జాతర నుంచి దేశాన్ని విముక్తం చేసి, రాజకీయ స్థిరత్వాన్ని , పారదర్శకతను జాతీయ అజెండాగా మార్చడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రస్థానం, భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత శక్తివంతంగా నిలబెట్టబోతోంది. దశాబ్దాలుగా నత్తనడకన సాగిన పరిపాలనా రంగానికి చరమగీతం పాడుతూ, కాలంచెల్లిన సంప్రదాయాల స్థానంలో నవభారత నిర్మాణానికి ఈ చరిత్రాత్మక నిర్ణయాలు అజేయమైన పునాది వేయనున్నాయి. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు, దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సమతుల్యత కోసం ఉద్దేశించిన ‘ది డీలిమిటేషన్ బిల్లు 2026 , దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా రూపొందించిన వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ వంటి అడుగులు కేవలం చట్టపరమైన మార్పులు మాత్రమే కావు. ఇవి నిరంతర ఎన్నికల జాతర, రాజకీయ అస్థిరతల నుంచి దేశాన్ని విముక్తం చేసే సరికొత్త వ్యూహాత్మక అస్త్రాలు. వీటికి తోడు, క్రిమినల్ కేసుల్లో అరెస్ట్ లేదా శిక్ష పడితే ప్రధానమంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినా తక్షణమే పదవులు కోల్పోయేలా చట్టాల్లో తేవాలనుకుంటున్న పారదర్శక మార్పులు.. రాజకీయాల్లో జవాబుదారీతనానికి సరికొత్త అర్థాన్ని ఇస్తున్నాయి. ఈ విప్లవాత్మక సంస్కరణల సమాహారమే యావత్ భారతదేశాన్ని ఒక పటిష్టమైన, నైతికమైన ప్రగతి పథంలోకి నడిపించబోతోంది.అన్నీ అనుకుంటాం కానీ సాధ్యమేనా? అని దశాబ్దాలుగా సగటు భారతీయుడు సందేహించిన ప్రతి అసాధ్యమైన నిర్ణయాన్ని సుసాధ్యం చేసి చూపిస్తోంది ప్రస్తుత భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి. వ్యవస్థల్లో వేళ్లూనుకుపోయిన అవినీతిని, నిర్ణయాత్మక లోపాలను నిర్మూలిస్తూ సాగుతున్న ఈ ప్రస్థానం భారత ప్రజాస్వామ్యానికే ఒక రక్షణ కవచం. అయితే, ఇక్కడ రాజకీయ వాస్తవికతను నిశితంగా పరిశీలిస్తే.. ఎన్డీఏ అనేది కేవలం సాంకేతిక భాగస్వామ్య కూటమి మాత్రమేనని స్పష్టమవుతుంది. ఈ సాహసోపేతమైన, అచంచలమైన నిర్ణయాల వెనుక ఉన్న అసలైన చోదక శక్తి, వందకు వంద శాతం రాజకీయ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీ ? అమిత్ షా ద్వయానికే దక్కుతుంది. ఈ ఇద్దరు నాయకుల అద్భుతమైన రాజకీయ సంకల్పం, జాతీయ ప్రయోజనాలే పరమావధిగా సాగించే మైండ్ గేమ్.. ప్రాంతీయ పార్టీల బ్లాక్‌మెయిలింగ్ పాలిటిక్స్‌కు, ఒత్తిళ్లకు శాశ్వతంగా తాళం వేశాయి. ఎలాంటి తొట్రుపాటు, తడబాటు లేని స్థిరత్వంతో కూడిన ఈ నయా రాజకీయం, దశాబ్దాలుగా పేరుకుపోయిన పాత ముద్రలను చెరిపేస్తూ ‘బీజేపీ బ్రాండ్ భారత్’ను ఆవిష్కరిస్తోంది. ప్రాంతీయ సెంటిమెంట్ల నడుమ కూడా జాతీయ సమగ్రతను కాపాడుతూ సాగుతున్న ఈ మహా సంస్కరణల పర్వం,. ప్రాంతీయ శక్తులు ఒకవైపు ఒత్తిడి పెంచుతున్నా, వాటిని సమర్థవంతంగా సమతూకం చేస్తూ, రాజీలేని వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. వందకు వంద శాతం రాజకీయ స్థిరత్వంతో, పటిష్టమైన సుదీర్ఘ వ్యూహంతో తాము అనుకున్న విధంగా దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మిత్రపక్షాలను ఎక్కడా నొప్పించకుండానే, వారితో సున్నితమైన రాజకీయ సమన్వయాన్ని పాటిస్తూనే.. తమ జాతీయ ఎజెండాను బలంగా అమలు చేయడం వీరి ప్రత్యేకత. సంకీర్ణ బంధాల పరిమితులను అధిగమించి, ఆధునిక భారతదేశ పరిపాలనపై సరికొత్త బీజేపీ బ్రాండ్ ముద్రను మోదీ-షా ద్వయం అత్యంత శక్తివంతంగా వేస్తోందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.భారతదేశంలో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టడం అనేది నివురుగప్పిన నిప్పులాంటి తేనెతుట్టెను కదిలించడమే. దేశంలో జనాభా ప్రాతిపదికన స్థానాలను పెంచాల్సి వచ్చిన ప్రతిసారీ ప్రాంతీయ శక్తులు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చాయి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసి దేశాభివృద్ధికి తోడ్పడిన తమకు సీట్లు తగ్గిపోతాయని, జనాభాను నియంత్రించని ఉత్తరాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాధాన్యత పెరిగిపోతుందనే భయాందోళనలు దశాబ్దాలుగా నడుస్తున్నాయి. చాలా ప్రాంతీయ పార్టీలు ఈ అంశాన్ని ఒక సెంటిమెంట్‌గా మార్చి, జాతీయ సమగ్రతకు భంగం కలిగేలా ప్రాంతీయ విభేదాలను రగల్చడం ద్వారా స్వార్థ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూశాయి. అయితే, ఈ తీవ్రమైన భౌగోళిక-రాజకీయ సంక్షోభానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన వ్యూహాత్మక 50 శాతం పెంచే మోడల్ శాశ్వత పరిష్కారాన్ని చూపింది. ఈ విప్లవాత్మక ఫార్ములా ప్రకారం ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలను 815కు పెంచబోతున్నారు. దీనివల్ల దేశంలో ఏ ఒక్క రాష్ట్రానికి కూడా ప్రస్తుతం ఉన్న సీట్ల సంఖ్య తగ్గకపోగా, దక్షిణాది రాష్ట్రాల సీట్లు ప్రస్తుతం ఉన్న 129 నుండి ఏకంగా 195కు పెరుగుతాయి. అత్యంత అద్భుతమైన వ్యూహం ఏమిటంటే, సభ మొత్తం స్థానాలు పెరిగినప్పటికీ, లోక్‌సభలో ఆయా రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్య శాతం ఏమాత్రం మారకుండా అలాగే కొనసాగుతుంది. ఈ చాకచక్యమైన లెక్కల సూత్రంతో ప్రాంతీయ పార్టీల ఆందోళనలకు, సెంటిమెంట్ రాజకీయాల నోళ్లకు పూర్తిగా తాళం పడింది. ఇది కూడా అన్యాయమేనంటూ కొందరు సంకుచిత రాజకీయం కోసం పైపైకి విమర్శలు గుప్పించవచ్చు గాక, కానీ అంతర్గతంగా ఏ రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్లడం లేదు కాబట్టి, పార్లమెంట్‌లో ఈ బిల్లుకు ముక్తకంఠంతో మద్దతు ఇవ్వక తప్పని అనివార్య పరిస్థితి ప్రాంతీయ పార్టీలకు ఏర్పడింది.

# అందెశ్రీ ఆశయాలే మా ప్రభుత్వానికి స్ఫూర్తి: రేవంత్






మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాటలు తూటాలై, ప్రజల్లో ఆత్మగౌరవాన్ని నింపాయని సీఎం పేర్కొన్నారు. దొరల గడప తొక్కకుండా ప్రజల కోసమే కలం పట్టిన వ్యక్తిగా ఆయన నిలిచారని, నిరాశలో ఉన్న ప్రతిసారీ తనకు ధైర్యం, దిశానిర్దేశం చేసిన వ్యక్తిలిఅందెశ్రీ పాటే తెలంగాణ ఆత్మగౌరవం అని తెలిపారు.

ఉద్యమ స్ఫూర్తికి చిరునామా అందెశ్రీ: రేవంత్

ప్రతి బడిలో ‘జయ జయహే తెలంగాణ’ మారుమోగుతోంది: సీఎం

అందెశ్రీ అని గుర్తు చేసుకున్నారు.

గత ప్రభుత్వం తెలంగాణ యువత ఉద్యోగాల గురించి ఆలోచించలేదని విమర్శించిన సీఎం, తమ ప్రభుత్వం ఏడాదిలోనే లి70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిలి యువతకు నియామక పత్రాలు అందించిందన్నారు. మిగిలిన ఖాళీలను కూడా భర్తీ చేసి ప్రతి అర్హుడికి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.తెలంగాణ ఉద్యమానికి సేవలందించిన వారికి తమ ప్రభుత్వం సముచిత గౌరవం కల్పిస్తోందని పేర్కొంటూ, అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను, చాకలి ఐలమ్మ మనుమరాలిని మహిళా కమిషన్ సభ్యులుగా, కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించామని తెలిపారు. తొమ్మిది మంది కవులను కోటి రూపాయల నగదు బహుమతితో సత్కరించామని చెప్పారు.తెలంగాణను ఎవరూ చెరబట్టలేరని, అలాంటి ప్రయత్నం జరిగితే అందెశ్రీ పాటే ప్రజల్లో మళ్లీ ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తుందని అన్నారు. అందెశ్రీ, గద్దర్, సోనియా గాంధీ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని,2034 వరకు ప్రజా ప్రభుత్వానిదే అధికారం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ‘భారత్‌ను గర్వపడేలా చేశారు’

మొదటి పేజీ తరువాయి

దీనికి పవన్ స్పందిస్తూ.. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు.‘ఆగమన్’ పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు.ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన ‘వందేమాతరం’ సందేశాన్ని విక్రమ్-1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ.. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా “ముందుకు సాగండి... మరింత ఎత్తుకు ఎగరండి... నేను మీ వెంటే ఉంటాను” అంటూ స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి



మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే ‘రైతు భరోసా’ అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు.

ప్రజాప్రభుత్వం పేదవారికి అండగా పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల జారీ చేశామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు త్వరలో ఇస్తామని, మూడో, నాలుగో విడతల ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని, అర్హులైన ప్రతిఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని మంత్రి అన్నారు.

రైతు భరోసా ఎకరాకు 6 వేలు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతుల కల్పన చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపిడివో సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



10 సంవత్సరాలు అధికారంలో ఉన్నపుడు యేనాడు నిషేధయోగుల గురుంచి మాట్లాడని కె టి ఆర్ ఇప్పుడు యువ భేరి పెట్టి ఎవరిని ఉద్ధరిస్తావ్ కె టి ఆర్ నీ సొంత చెల్లి కే నువ్వు అన్నావు కాలేవ్ ఈ రోజు డి సి సి అధ్యక్షులు మొదటి రోహిత్ ముధిరాజ్ గారి పిలుపు మేరకు అమర వీరుల స్తుపం ధగార కేటీఆర్ కు సవాల్ విసరడం జరిగింది ఈ కార్యక్రమంలో మోత రోహిత్ ముధిరాజ్ డిసిసి ఉపాధ్యక్షుడు చంద్ర మోహన్ యాదవ్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షా ఆరిఫ్ఎగ్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ ప్రెసిడెంట్ ముంద్రయి శ్రీనివాస్ మీడియా కోఆర్డినేటర్ కె శ్రీకాంత్ యాదవ్ జాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజ్ కుమార్ మంగళ్‌హాట్ డివిజన్ అధ్యక్షుడు తుల్జారామ్ దత్తాత్రేయ నగర్ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తో గోషమహల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియూ కార్యకర్తలు పాల్గొన్నారు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు ఎంపీ మల్లు రవి ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేసిన దళిత సామాజిక వర్గ ఎమ్మెల్యే లు, ఎంపీ లు..

17.07.2026న జరిగిన ఎస్సీ ఎమ్మెల్యేలు మరియు ఎంపీల సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను సమర్పించారు. వాటిలో ప్రధానంగా

1. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద భూమి లేని ఎస్సీ కుటుంబాలకు భూ కేటాయింపును పెంచాలి.
2. ప్రతి ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా 1000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి.
3. వీలైనంత త్వరగా LIDCAPకు ఒక చైర్మన్‌ను నియమించాలి.
4. ప్రత్యేక చైర్మన్‌తో ఒక కేటాయించిన భూముల కమిటీని ఏర్పాటు చేయాలి.
5. జీవనోపాధి మరియు స్వయం ఉపాధి కార్యక్రమాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయింపులను పెంచాలి.
6. ప్రభుత్వ శాఖలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలలోని ఎస్సీ/ఎస్టీ బ్యాక్‌లాగ్ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి.
7. పారిశ్రామికవేత్తలకు రూ. 15 కోట్ల వరకు పూచీకత్తు లేని రుణాలు అందించడానికి, రూ. 100 కోట్ల ప్రారంభ నిధితో ఒక ఎస్సీ/ఎస్టీ ఎంఎస్ఎంఈ నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలి.
8. అన్ని ఎస్సీ/ఎస్టీ నియోజకవర్గాలలో రాజీవ్ యువ వికాసం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి.
9. ఇందిరా జలప్రభ పథకం కింద ఎస్సీ/ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ప్రాతిపదికన బోర్‌వెల్స్ అందించాలి.
10. ప్రత్యేక ఆర్థిక మండలాలు (SEZ\T) మరియు పరిశ్రమలలో సృష్టించబడిన ఉపాధి అవకాశాలలో ఎస్సీ/ఎస్టీ యువతకు రిజర్వేషన్ కల్పించాలి.
11. శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టళ్ల ఆధునీకరణకు తగిన నిధులను మంజూరు చేయాలి.
12. ఎస్సీ ఉప ప్రణాళికకు పూర్తి కేటాయింపులు మరియు సమర్థవంతమైన అమలును నిర్ధారించాలి.
13. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులకు భూ పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలి.
14. ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గాలకు అధిక అభివృద్ధి నిధులను కేటాయించాలి.

# స్మార్ట్ రేషన్ కార్డులతో అక్రమాలకు చెక్

## (సి.హెచ్. ప్రతాప్)

సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అర్హులకు సకాలంలో ప్రయోజనాలు అందించడం ఏ ప్రభుత్వానికైనా ప్రధాన బాధ్యత. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ రేషన్ కార్డులు ఈ లక్ష్యాన్ని మరింత సమర్థంగా సాధించే దిశగా కీలక అడుగుగా చెప్పవచ్చు. క్యూఆర్ కోడ్, డిజిటల్ ధ్రువీకరణ, బయోమెట్రిక్ అనుసంధానం వంటి సాంకేతికతతో కూడిన ఈ కార్డులు ప్రజా పంపిణీ వ్యవస్థలో నకిలీ కార్డులు, ద్వంద్వ నమోదులు, అక్రమాలపై సమర్థమైన నియంత్రణకు దోహదపడతాయి. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునికీకరించేందుకు భారీ స్థాయిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇప్పటి వరకు కాగితపు రేషన్ కార్డుల కారణంగా నకిలీ నమోదులు, అనర్హులకు ప్రయోజనాలు, మధ్యవర్తుల జోక్యం వంటి సమస్యలు అప్పుడప్పుడూ వెలుగులోకి వచ్చాయి. స్మార్ట్ కార్డుల ద్వారా ప్రతి కుటుంబానికి ప్రత్యేక డిజిటల్ గుర్తింపు ఉండటంతో ఈ లోపాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. ప్రతి లావాదేవీ డిజిటల్‌గా నమోదవడం వల్ల పర్యవేక్షణ సులభమవుతుంది. లబ్ధిదారుల వివరాలు కేంద్రీకృత డేటాబేస్‌తో అనుసంధానమవడంతో పారదర్శకత మరింత పెరుగుతుంది.

తెలంగాణలో ఇటీవల అచేతనంగా ఉన్న వేలాది రేషన్ కార్డులపై ధృవీకరణ ప్రక్రియ చేపట్టడం కూడా వ్యవస్థను ప్రక్షాళన చేసే ప్రయత్నంలో భాగమే. అర్హులైన కుటుంబాలకు మాత్రమే ప్రయోజనాలు చేరేలా నిరంతర పరిశీలన అవసరమని ఈ పరిణామం సూచిస్తోంది.

అయితే సాంకేతికత ఒక్కటే పరిష్కారం కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సమస్యలు, బయోమెట్రిక్ ధ్రువీకరణలో ఎదురయ్యే ఇబ్బందులు, వృద్ధులు, దివ్యాంగులకు కలిగే అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ విధానాలను కూడా ప్రభుత్వం అందుబాటులో ఉంచాలి. రేషన్ దుకాణాల నిర్వాహకులకు తగిన శిక్షణ, సాంకేతిక సహాయం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ బలోపేతం కావాలి.

స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం కొత్త కార్డులు కాదు; ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత నమ్మకమైనదిగా, పారదర్శకమైనదిగా తీర్చిదిద్దే సంస్కరణ. సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ నిజమైన లబ్ధిదారులకు సంక్షేమం చేరేలా చేయడమే ఈ కార్యక్రమం విజయానికి అసలైన కొలమానం. ప్రభుత్వం, అధికారులు, రేషన్ డీలర్లు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే తెలంగాణ ప్రజా పంపిణీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.

# ఆర్ఎంపి ,పిఎంపి వైద్యులపై దాడులు ఆపండి

## రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా కు ఆర్ఎంపి ,పిఎంపి అసిసియేషన్ విజ్ఞప్తి



హైద్రాబాద్ జులై 18 :రాష్ట్రం లో గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ప్రాథమిక చికిత్స ,వైద్య అందిస్తున్న RMP & PMP వైద్యులపై దాడులు ఆపాలని RMP & PMP వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ను అసిసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బా చంద్రశేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండెం నాగభూషణం ల బృందం కలిసి వినతి పత్రంసమర్పించారు.గ్రామీనా ప్రాంతలల్లో నిరుపేదలకు వైద్యం అందించడం లోRMP & PMP వైద్యులు చేస్తున్న సేవలను వారు మంత్రి దృష్టికి తెచ్చారు.వీరిపై వైద్యాది కారులు చిన్న చ్ఛిన్న కారణాలు చూపి దాడులకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మంత్రిని కలిసిన వారిలో వంజరి విష్ణు .కృష్ణమూర్తి .హేమశ్రీనివాస నాయక్ శ్రీనివాస్ . నారాయణ దాస్ .దినకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల రెంటు

## రూ.55 వేలకు పెంచాలి

### పాత బకాయిలు వెంటనే చెల్లించాలి

### తెలంగాణా అద్దె వాహనాల సంఘం డిమాండ్

### ఆర్.కృష్ణయ్య హామీమేరకు సమ్మె విరమణ

హైద్రాబాద్ జులై 18 : ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల వేతనము పెంచాలని తెలంగాణా అద్దె వాహనాల సంఘం డిమాండ్ చేసింది.

అద్దె వాహనాల వేతనము పెంపు కొరకు శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది ఈ సమావేశానికి సంఘం అధ్యక్షులు నర్సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మదాసు రాజు అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం, జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు, ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు.ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ

ప్రభుత్వ కార్యాలయ అద్దె వాహనాల వేతనము పెంపు 9 సం" పెంచలేదు. రాష్ట్ర ప్రభుత్వ అద్దె వాహనాల రెట్లు ను 34వేల నుంచి 55 వేలకు పెందాలని, ఒక సంవత్సరం నుంచి పెండింగ్ లో ఉన్న అద్దె వాహనాల రెంటును చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వీరికి ఇస్తున్న అద్దె 9 సంవత్సరాల క్రితం 2017లో నిర్ణయించారు. ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి ద్రవ్యల్బం పెరిగింది కార్ల అద్దె పెంచవలసిన ఆవశ్యకత ఉంది అద్యకార్లకు ఇచ్చే రెంటు ఒక ప్రభుత్వం అటెండర్ ఇచ్చే జీతంకు సరిపోదు ప్రభుత్వం నడిపే సంతకారులకు ఒక్కొక్క దానికి డ్రైవర్ జీతం 50,000 డీజిల్ 30000 రిపేర్లు ఆయిలు మెయింటెనెన్స్ 20000 మొత్తం ఒక లక్ష ఖర్చవుతుంది ఇక్కడ బ్యాంకు రుణాలపై తెచ్చిన కార్లకు 34,000 ఇస్తే ఎలా సరిపోతాయని కృష్ణయ్య ప్రశ్నించారు.




ప్రభుత్వ కార్యాలయంలో అద్దె వాహనాలు నడుపుతున్న 2017 సం॥లో ప్రభుత్వం వారు నెలకు రూ:-34,000/-

రెండు పిక్స్ చేశారు. అప్పటి నుండి ఇదే కొనసాగటం వలన ఇప్పుడు అధికంగా పెరిగిన ధరల వలన గిట్టుబాటు అవటం లేదు, దీనివల్ల ఆర్ధిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకి పెరుగుతున్న ధరలు, పెరిగిన పెట్రోల్, డిజిల్ ఖర్చుల వల్ల అనేక కష్టాలు పడుతున్నారు.

2017 సం॥ లో లీటరు, డిజిల్ కు రూ.64/- లు యుండేది. కానీ ప్రస్తుతం రూ:-110/- లకి పెరిగింది, కావున అద్దె వాహనాల వేతనము ప్రస్తుతం ఉన్న డిజిల్ పెట్రోల్ ఇతర దరలకు అనుగుణంగా పెంచాలి.

అలాగే నిత్యావసర వస్తువుల ధరల పెరిగాయి. కుటుంబాలను ఎలా పోషించాలి. అలాగే అలాగే బ్యాంకు రునలుకు జువీ×లు ఎలా కట్టాలి. కార్లు ఆయిల్ పిల్లల ఫీజులు ఎలా కట్టాలి. రిపేర్లు ఎలా చేయాలి. మెంటినేన్స్ ఎలా? ప్రస్తుతం ఇచ్చే 34 వేలు ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు.

గతంలో కుడా చాల అధికారులకు, కూడా విన్నవించుకున్నాము కాని ఎటువంటి స్పందనలేదు. సంవత్సరం నుండి బిల్లులు చెల్లించటంలేదు. అప్పులు చేసి వాహనం నడుపటం వలన ఆర్థికంగా తట్టుకోలేక ఆత్మహత్యలకు దారితీస్తుందన్నారు

సమ్మె విరమించండి :

గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్నా కార్ల డ్రైవర్లకు సమ్మె విరమిందాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. కృష్ణయ్య పిలుపు మేరకు సమ్మెను విరమిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్ యాదవ్,ప్రధాన కార్యదర్శి మద్రాసు రాజులు ప్రకటించారు.ఈ సమావేశం లో సంఘం ఉపాధ్యక్షులు మహమ్మద్ ఆయుబ్ అలీ,అబ్దుల్ రహమాన్,షేక్ అక్బర్ పాషా,మాలరపు కృష్ణ,రాలరావు ప్రసాద్,శ్రీశైలం తదితరులు పాల్ గొన్నారు.

నీల వెంకటేష్, అనంతయ్య, పర్లగోర్ల మోడీరాందేవ్ యాదవ్, రాజేందర్, వంశీ మోహన్, అంజి గౌడ్, సిద్దయ్ తదితరులు పాల్గొంటున్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్ల పనితీరు మెరుగుపడింది

## దామోదర్ రాజనర్సింహ



మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో, ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే సంఖ్య కూడా పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. అదే సమయంలో ప్రైవేటు హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్ల సంఖ్య తగ్గుతున్నట్టు ప్రైవేటు హాస్పిటళ్ల యజమానులు చెబుతున్నారని మంత్రి వెల్లడించారు.

మరోవైపు, ప్రభుత్వ హాస్పిటళ్లలో పనిచేసేందుకు డాక్టర్లు ఆసక్తి చూపుతున్నారని, ఇటీవల జరిగిన డాక్టర్ల రిక్రూట్‌మెంట్లతో ఈ విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈ మేరకు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్, ఏరియా హాస్పిటళ్లు సహా వంద బెడ్లు కలిగిన అన్ని ప్రభుత్వ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లతో మంత్రి శనివారం సమావేశం నిర్వహించారు.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్‌పర్సన్, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు మెరుగు పడడంలో సూపరింటెండెంట్ల పాత్ర అత్యంత కీలకం అని మంత్రి అభినందించారు.

పేషెంట్లు తమ పెట్టుకున్న నమ్మకాన్నా కాపాడుకుంటూ, వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు, డాక్టర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అందరిపై ఉందన్నారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.

గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు 14 వేల పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు.. డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది సహా అవసరమైన అన్ని విభాగాల్లో నియామకాలు చేపట్టామని, ఇంకా అవసరమున్న చోట్ల పోస్టుల భర్తీ కొనసాగుతోందన్నారు. అద్దె భవనాలు, పాత భవనాలు, ఇరుకు భవనాల్లో కొనసాగుతన్న హాస్పిటళ్ల స్థానంలో కొత్త భవనాలు నిర్మించి ఇస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. అవసరమైన మెడిసిన్, సర్జికల్స్ అన్ని అందిస్తున్నామన్నారు.

ప్రభుత్వం అన్ని వనరులను అందిస్తున్న నేపథ్యంలో సేవల నాణ్యతలో లోపాలకు ఎలాంటి సాకులు చెప్పొద్దని సూపరింటెండెంట్లకు మంత్రి సూచించారు. ఏ అవసరం ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్, శాఖ హెచ్‌వోడీ మొదలుకుని మంత్రి వరకూ అందరికీ సమాచారం చేరవేయాలని మంత్రి సూచించారు.

ప్రతి సూపరింటెండెంట్ తన హాస్పిటల్‌ను ఓన్ చేసుకోవాలని, రోగులు ఆసుపత్రిలో అడుగుపెట్టిన నాటి నుంచి డిశ్చార్జి అయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వ్యవస్థను రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రతి రోజు వార్డులను స్వయంగా సందర్శించి రోగులతో మాట్లాడాలని, వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన నాణ్యత, భద్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం, అనవసర గైర్హాజరు, రోగులను గంటలతరబడి వెయిట్ చేయించడం.. ట్రీట్‌మెంట్‌లో జాప్యం చేయడం వంటి అంశాలను సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.

అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ప్రసూతి విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ యూనిట్లు, ల్యాబ్‌లు, బ్లడ్ బ్యాంకులు, రేడియాలజీ సేవలు 24 గంటలు సమర్థవంతంగా పనిచేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే చికిత్స ప్రారంభించాలని సూచించారు.

ప్రభుత్వం అందిస్తున్న ఆధునిక వైద్య పరికరాలు వినియోగంలో ఉండేలా చూడాలని, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతు చేయించాలని, మందుల కొరత, పరికరాల లోపం, మౌలిక సదుపాయాల సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని మంత్రి సూచించారు.

హాస్పిటళ్ల పనితీరును ఇకపై నిరంతరం సమీక్షిస్తామని, ఇందుకోసం డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఓపీ, ఐపీ సేవలు, శస్త్రచికిత్సలు, అత్యవసర సేవలు, మాతా-శిశు ఆరోగ్య సేవలు, రోగుల సంతృప్తి, పరిశుభ్రత, సేవల నాణ్యత వంటి సూచీల ఆధారంగా పనితీరును అంచనా వేస్తామని చెప్పారు. ఉత్తమ పనితీరు కనబరిచిన డాక్టర్లు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఎంపీ డాక్టర్ మల్లు రవి కి సి.నారాయణరెడ్డి

## పాలనా ప్రతిభ పురస్కార ప్రదానం



హైద్రాబాద్ జులై 18: రవీంద్రభారతిలో శృతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి జన్మదిన సందర్భంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిని సి.నారాయణరెడ్డి పాలనా ప్రతిభ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు రవి ఆత్మీయ బంధువు ప్రముఖ వ్యాపారవేత్త నార్మల్ల భాస్కర్ గజమాల మరియు కాంగ్రెస్ రంగు టోపీ తో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ రవీంద్ర భారతి లాంటి ఆడిటోరియం లో ప్రతి జిల్లాలో నిర్మించాలని తెలిపారు. శృతిలాయ ఆమని గారి గీతాలను ప్రత్యేకంగా విని ఆస్వాదించారు.

# సేనతో నేను..

గుంటూరు, జూలై 18, జనసేన పార్టీ స్థానిక ఎన్నికల కోసం సమాయత్తమవుతుంది. సెప్టంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లో జరగనున్నాయి. దీంతో జనసేన అప్రమత్తమయింది. కార్యకర్తల్లో ఉన్న నిరాశ, నిస్పృహలను తొలగించడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చర్చా వేదిక కార్యక్రమాన్ని నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్న నినాదంతో కార్యకర్తల్లో తిరిగి ఉత్సాహం నింపేందుకు ఆ పార్టీ ఈ కార్యక్రమం డిజైన్ చేసిందని చెప్పాలి. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు ఎదురవుతున్న సవాళ్లపై పార్టీ దృష్టి పెట్టిందని అనుకోవాలి. నియోజకవర్గాల వారీగా చర్చా వేదికను ఏర్పాటు చేసి కార్యకర్తల మనసులో మాటను విని వారి సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స జరగడంతో ఈ బాధ్యతను మంత్రి నాదెండ్ల మనోహర్ తీసుకున్నారు. జనసేన లో ఏ గ్రూపులు ఉండవని, పవన్ కల్యాణ్ గ్రూపు ఒక్కటే ఉంటుందని కార్యకర్తలకు చెబుతున్నారు. ఈ వేదిక ద్వారా నాయకులు, కారకర్తల సమన్వయం కుదర్చడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. జనసేన పార్టీకి క్రియాశీలక సభ్యత్వం 24 లక్షల మార్క్ కు చేరుకుంది. నియోజకవర్గాల్లో జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలు విని వాటిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వనున్నారు. . స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ బూత్ లెవెల్ లో నిలబడి పార్టీకి ఓటు వేయించాలంటే కార్యకర్త ఉత్సాహంగా ఉండాలి. ఆ ఉత్సాహం నింపేందుకే ఈ కార్యక్రమం అనుకోవాలి.

# ముద్రగడ ఫ్యామిలీ ఫ్యూచర్ ఏంటీ

కాకినాడ, జూలై 17 దశాబ్దాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తన సంచలన నిర్ణయాలతో, సుదీర్ఘ సామాజిక పోరాటాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం మృతితో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. అయితే, ఆయన జీవిత చరమాంకంలో, అంత్యక్రియల వేళ కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నడిపిన రాజకీయ వ్యూహాలు ఆయన కుటుంబానికి కనీస ప్రశాంతత లేకుండా చేశాయి. జీవించి ఉన్నంత కాలం ముద్రగడ చేత సుదీర్ఘ లేఖలు రాయించి, తమ పొలిటికల్ అజెండా కోసం ఆయన ఇమేజ్‌ను వాడుకున్న వైసీపీ.. ఇప్పుడు ఆయన లేని తరుణంలో ఆ కుటుంబాన్ని పట్టించు కుంటుందా అన్న చర్చ నడుస్తుంది.

గత ఎన్నికల ముందు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరిన నాటి నుండి, ఆయనను పూర్తిగా ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించే ఒక రాజకీయ ఆయుధంగానే అధినాయకత్వం వాడుకుందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కూటమి నేతలపై లేఖల అస్త్రాలు సంధించడానికి, కుల సమీకరణలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి నాటి అధికార పార్టీ ఆయనకు ప్రాధాన్యతనిచ్చింది. కానీ, ఇప్పుడు ఆయన భౌతికంగా లేరు. ముద్రగడ రాజకీయ వారసత్వాన్ని మోయాల్సిన ఆయన కుమారుడు గిరిబాబు ప్రస్తుతానికి రాజకీయంగా అంత యాక్టివ్‌గా లేరు, పైగా ఆర్థికంగానూ పటిష్టమైన న్యాగ్గోథితిలో లేరనే గుసగుసలు కిర్లంపూడి వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.

ఇలాంటి బలహీనమైన తరుణంలో వైసీపీ ఆ కుటుంబాన్ని ఎంతవరకు ఆదుకుంటుందనేది పెద్ద ప్రశ్నార్థకమే.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ శైలిని దగ్గరుండి గమనించిన ఎవరికైనా ఒక విషయంపై పూర్తి స్పష్టత ఉంటుంది.

తమకు రాజకీయంగా అవసరం ఉన్నంత కాలమే ఎవరికైనా రెడ్ కార్పెట్ పరుస్తారని, ఒకసారి ఆ అవసరం తీరిపోయాక వారిని కరివేపాకులా తీసిపారేస్తారనే విమర్శలు పార్టీలోనే బలంగా ఉన్నాయి. గతంలో పార్టీ కోసం కష్టపడిన ఎందరో సీనియర్ల కుటుంబాలను జగన్ రెడ్డి ఎలా పక్కన పెట్టారో ఉదాహరణలు కళ్లముందే ఉన్నాయి. ఇప్పుడు ముద్రగడ కుటుంబం విషయంలోనూ ఇదే రిపీట్ కాబోతోందని, జగన్ కానీ, వైసీపీ టాప్ లీడర్‌షిప్ కానీ ఇకపై ముద్రగడ కుటుంబాన్ని పెద్దగా పట్టించుకునే ప్రసక్తే లేదని అంటున్నా?.ప్రస్తుతానికి ముద్రగడ మృతి పట్ల వైసీపీ నేతలు సానుభూతి ప్రకటిస్తున్నప్పటికీ, రాబోయే రోజుల్లో వారి అసలు రంగు బయటపడుతుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ముద్రగడ వారసులకు అసెంబ్లీ లేదా పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చే ఉద్దేశం జగన్ మోహన్ రెడ్డికి అస్సలు లేదు. కష్టకాలంలో జెండా మోసేవారికే దిక్కులేని వైసీపీలో, కేవలం ఎన్నికల ముందు వచ్చి చేరిన సీనియర్ నేత కుటుంబానికి భవిష్యత్తు సీట్ల కేటాయింపుల్లో అగ్రతాంబూలం ఇస్తారని అనుకోవడం ముమ్మాటికీ అమాయకత్వమే అవుతుంది. ఇప్పుడున్న సానుభూతి పవనాలు చల్లారిన తర్వాత, సరిగ్గా మరో ఆరు నెలలకో లేదా ఏడాదికో ముద్రగడ కుటుంబానికి వైసీపీలో ఎలాంటి ప్రాధాన్యత దక్కుతుందో, ఎన్ని అవమానాలు ఎదురవుతాయో అందరూ ప్రత్యక్షంగా చూస్తారని వేసీపీ నేతలే జోస్యం చెబుతున్నారు

# పోలవరానికి పర్యాటక శోభ

రాజమండ్రి, జూలై 18 ఆంధ్రప్రదేశ్‌లో పోలవరానికి పర్యాటక శోభను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. పోలవరం డ్యామ్‌తోపాటు గోదావరి నదీ తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంతోపాటు ప్రాజెక్టు దిగువన, ఎగువన టూరిజం డెవల్మెంట్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ అంశంపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారలుతో పాటు ఏజెన్సీలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు.

నదీతీరం వెంట టూరిజం ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు వద్ద కేబుల్ బ్రిడ్జ్ డిజైన్, స్పిల్ వే బ్యూటిఫికేషన్ సహా మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిలో అనుభవం ఉన్న నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించారు.పోలవరం ప్రాజెక్టు ఎగువున భద్రాచలం సమీపం వరకు ఏపీ భూభాగంలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో మంచి పర్యాటక ప్రాంతంగా పోలవరం మారుతుందని సీఎం అన్నారు. ఎకో టూరిజం, రాక్ క్లైంబింగ్, వెల్‌నెస్ సెంటర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వాటికి అనుకూలంగా మార్చాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరాన్ని ప్రత్యేకంగా నిలపేలా చేయాలన్నారు.ఇంజనీరింగ్ టూరిజం, రివర్ ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం డెవల్మెంట్‌కు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమన్న ఏజెన్సీ.. వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని వివరించింది. స్పిల్ వే దిగువన నది మధ్యలో 500 ఎకరాల ఐ లాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసే విషయంలో పలు డిజైన్లు ప్రతిపాదనలను అందించారు. అలాగే మధ్యలో ఉండే వాటర్ బాడీలు, కొండలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. స్పిల్ వే దిగువన కేబుల్ బ్రిడ్జ్ డిజైన్లపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐలాండ్‌గా ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మొత్తం 1,500 ఎకరాల్లో తీసుకురాదగిన ప్రాజెక్టులపై నిప్పాన్ కోయి సంస్థ ప్రజెంటేషన్‌లో పలు ప్రతిపాదనలు చేసింది.ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు...పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, స్థానికంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఆమేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

# కూటమికి టికెట్ల సవాల్

విజయవాడ, జూలై 18 ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు.మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.

15 తర్వాత మున్సిపల్ ఎన్నికలు

ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి.ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డో కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. స్థానిక సమరానికి ముందే పార్టీ నేతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పదవులు దక్కిన నేతలు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

# ఖరీఫ్ ఆశల గల్లంతు

కర్నూలు జూలై 18 ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఎప్పటి నుంచో వెన్నెముకగా నిలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఐటీ , పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టినా, ఇప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం వ్యవసాయమే. అయితే ఈ ఏడాది ఎల్ నినో ( ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పంటల సాగు ప్రారంభం కావాల్సిన సమయంలోనే వానలు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌పై అనిశ్చితి నెలకొంది.సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేను రోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతం లోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు 70 శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది.రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతోంది. బోర్లు ఎండిపోవడం, చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది.ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు లేకపోవడం మాత్రమే కాకుండా, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో విత్తనాలు వేయడానికి కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాగు పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తిపై మాత్రమే కాకుండా గ్రామీణ ఉపాధి, రైతుల ఆదాయం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

వాతావరణ పరిస్థితులు త్వరగా మారి జూలై రెండో పక్షంలో అయినా మంచి వర్షాలు కురిస్తే కొంతవరకు పరిస్థితి మెరుగుపడే అవకాశముందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు. లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి.

# పెందుర్తిలో మూడు ముక్కలాట

విశాఖపట్టణం, జూలై 18 విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు కలిగిన స్థానం. 1979లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం నుంచి పలువురు ప్రముఖ నాయకులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాష్ట్ర రాజకీయాల్లో తమ ముద్ర వేశారు. ద్రోణంరాజు సత్యనారాయణ వంటి సీనియర్ నాయకులు కూడా ఇక్కడి నుంచే శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. దీంతో ప్రతి ఎన్నికల్లో ఈ నియోజకవర్గంపై ప్రధాన పార్టీల దృష్టి ఎక్కువగా ఉంటుంది.

నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పరవాడ మండలం పెందుర్తి పరిధిలోకి రావడంతో రాజకీయ సమీకరణాలు కూడా మారాయి. ఆ సమయంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తన రాజకీయ కేంద్రాన్ని పెందుర్తికి మార్చుకున్నారు. 2014 ఎన్నికల్లో ఆయన విజయం సాధించినప్పటికీ, 2009 మరియు 2019 ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొన్నారు. అనంతరం 2024 ఎన్నికల సందర్భంగా ఆయనను మాడుగుల నియోజకవర్గానికి మార్చగా, కూటమి ఒప్పందంలో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేన కి కేటాయించారు. అక్కడ నుంచి పంచకర్ల రమేష్ బాబు విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.అయితే భవిష్యత్ రాజకీయాలపై బండారు సత్యనారాయణమూర్తి ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమారుడు బండారు అప్పలనాయుడు ను రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. అందుకే తమ కుటుంబానికి బలమైన పట్టున్న పెందుర్తి నుంచే ఆయనను బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. 2029 ఎన్నికల్లో తన వారసుడికి అవకాశం కల్పించి, అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరం కావాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పెందుర్తిలో పార్టీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తన అనుచరులను ఏకతాటిపై ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.మరోవైపు టీడీపీ లోనే మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కూడా ఇదే స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఆయన తర్వాత టీడీపీలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. ప్రస్తుతం పార్టీ ఆయనకు పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు నామినేటెడ్ పదవిని కూడా అప్పగించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో తనకే అవకాశం వస్తుందనే నమ్మకంతో ఆయన తన వర్గాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని చెబుతున్నారు. దీనితో టీడీపీలోనే రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం నెలకొన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో జనసేన కూడా ఈ స్థానాన్ని తమకు కీలకమైన నియోజకవర్గంగా భావిస్తోంది. ప్రజారాజ్యం పార్టీ కాలంలో తొలిసారి ఈ ప్రాంతంలో విజయం సాధించిన పంచకర్ల రమేష్ బాబు, 2024లో జనసేన అభ్యర్థిగా మరోసారి గెలిచి తన రాజకీయ బలాన్ని నిరూపించుకున్నారు. అందువల్ల 2029 ఎన్నికల్లో కూడా ఆయననే బరిలో దింపాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గం కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కేంద్రంగా మారింది. టీడీపీలోనే నాయకుల మధ్య టికెట్ పోటీ ఉండగా, జనసేన కూడా ఈ స్థానాన్ని వదులుకునే పరిస్థితిలో కనిపించడం లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ సీటు ఏ పార్టీకి దక్కుతుంది, ఎవరు అభ్యర్థిగా నిలుస్తారు అనే అంశం ఇప్పటి నుంచే రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# టీడీపీలోకి వాసిరెడ్డి...

విజయవాడ జూలై 18 వైసీపీ నుంచి బయటకు వచ్చిన మహిళా నాయకురాలు.. వాసిరెడ్డి పద్మకు పొలిటికల్‌గా లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. తాజాగా మంత్రి నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. దీంతో త్వరలోనే ఆమె టీడీపీ కండువా కప్పుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రతి విషయంలోనూ దూకుడుగా ఉండే వాసిరెడ్డి పద్మ దాదాపు 20 ఏళ్లకుపైగానే రాజకీయాల్లో కొనసాగుతున్నారు.వైసీపీ అధికార ప్రతినిధిగా.. ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించినా.. జగన్ ఆమెకు అవకాశం ఇవ్వలేదు. దీంతో అప్పటి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల అనంతరం.. వైసీపీ నుంచి బయటకు వచ్చిన పద్మ.. సంచలన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. జగన్ కారణంగానే అందరూ ఓడిపోయారని అన్నారు. పార్టీని నడిపించడం.. నాయకులను సమన్వయం చేయడం కూడా రాదని పద్మ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి బయటకు వచ్చిన ఆమె.. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరకుండా మౌనంగా ఉన్నారు. సుమారు ఏడాదిన్నరగా మౌనంగా ఉన్న పద్మ.. తాజాగా టీడీపీలో చేరనున్నట్టు తెలుస్తోంది. పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. ఆయన పనితీరు, మంత్రి వర్గంలో వ్యవహరిస్తున్న తీరునుకొనియాడారు.అయితే.. ఇప్పటికిప్పుడు వాసిరెడ్డి చేరికపై పార్టీలో ఎలాంటి ప్రకటన రాలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వస్తుందని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పద్మకు అవకాశం దక్కుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. పైగా వచ్చే ఎన్నికల నాటికి మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్న దరిమిలా వాసిరెడ్డికి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు కూడా మంచి అవకాశం చిక్కే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ కి ఇక డెత్ డిక్లరేషనే - కేటీఆర్

**యువతను మోసం చేసిన రాహుల్ ప్రియాంక కాంగ్రెస్ కి రాజకీయంగా డెత్ డిక్లరేషన్ రాస్తుందన్న కేటీఆర్**

**తెలంగాణ యువతకు రాహుల్ వెన్నుపోటు**

**నోటిఫికేషన్లు లేవు.. అన్నీ లూటిఫికేషన్లే**

**రాష్ట్రంలో "స్కాం" క్యాలెండర్ నడుస్తోంది**

**కొలువుల జాతర చేస్తామని కుంభకోణాల కుంభమేళా సాగిస్తున్నారు**

**రేవంత్ జాబులు కాదు రాహుల్ జేబులు నింపుతున్నడు**

**అధైర్య పడొద్దు.. తెలంగాణ నిరుద్యోగులకు అన్నగా తోడుంటా..**

**ఇప్పటిదాకా ఒక లెక్క... ఇకపై ఇంకో లెక్క**

**కాంగ్రెస్ 'యూత్ డిక్లరేషన్' ఒక దగా**

**సరూర్ నగర్ 'యువసంగ్రామ సదస్సు'లో కేటీఆర్ గర్జన**







తెలంగాణ యువతను యూత్ డిక్లరేషన్ పేరుతో దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఇక డెత్ డిక్లరేషనే మిగిలిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ ఇచ్చిన వేదికపైనే.. తెలంగాణ యువత కాంగ్రెస్కు 'డెత్ డిక్లరేషన్ రాస్తుందన్నారు. సరిగ్గా మూడేళ్ల క్రితం ఏ సరూర్ నగర్ స్టేడియం వేదికగా కాంగ్రెస్ పార్టీ 'యూత్ డిక్లరేషన్' బురిడీ పత్రాన్ని ఆవిష్కరించిందో, అదే వేదికపై ఇవాళ తెలంగాణ నిరుద్యోగ యువత కాంగ్రెస్ మోసాలను గ్రహించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. మాట తప్పి, నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే గడ్డపై నుంచి యువత 'డెత్ డిక్లరేషన్' (రాజకీయ మరణ శాసనం) రాయడానికి సిద్ధంగా ఉందని కేటీఆర్ హెచ్చరించారు. మాయమాటలతో యువతను మోసం చేస్తామంటే కుదరదు అని...నిరుద్యోగుల ఉడుకు నెత్తురు, ఉరకలెత్తే ఆశయాల ముందు దగాకోరు రేవంత్ ప్రభుత్వం మోకరిల్లక తప్పదన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. తెలంగాణ యువతను జిత్తులమారి ముసలి నక్కలా కాంగ్రెస్ పార్టీ తెలివిగా చిత్తు చేసిందన్నారు. ఇవాళ సరూర్ నగర్ లో జరిగిన యువసంగ్రామం సదస్సులో మాట్లాడిన కేటీఆర్, 60 ఏళ్లు తెలంగాణ నెత్తురు రుచి మరిగిన కాంగ్రెస్.. కొత్త డూప్లికేట్ రూపాల్లో వచ్చి నకిలీ ప్రేమను కురిపించి యువతను బలిపీఠం ఎక్కించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ పెద్ద మోసం అన్న కేటీఆర్, ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ఓ బురిడీ పత్రాన్ని విడుదల చేశారని మండిపడ్డారు. దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ కు డెత్ డిక్లరేషన్ ఇవ్వాలని నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ, ప్రియాంక లు చేసిన మోసాన్ని యువత మార్చిపోదన్న కేటీఆర్, గుర్తుపెట్టుకుని కచ్చితంగా గుణపాఠం చెపుతుందన్నారు.

రాహుల్ గాంధీ ప్రచారం చేసుకునే 'మొహబ్బత్ కీ దుకాన్' (ప్రేమ దుకాణం) తెలంగాణ యువత పాలిట 'గద్దారీ కా మకాన్' (ద్రోహుల ఇల్లు) గా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సరూర్ నగర్ యువ సంగ్రామం సదస్సులో మాట్లాడిన కేటీఆర్, రాహుల్ కు తెలుగు రాదు కాబట్టి, తెలంగాణ యువత పడుతున్న వేదనను ఆయనకు అర్థమయ్యే భాషలోనే చెపుతానంటూ హిందీలో మాట్లాడారు. మూడేళ్ల క్రితం అశోక్ నగర్ చౌరస్తాలో ఛాయ్ తాగుతూ నిరుద్యోగులతో దిగిన ఫోటోలు, ఇచ్చిన జూటా హామీలు గుర్తున్నాయా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు.

"రాహుల్ గాంధీ గారూ.. మీకు తెలుగు రాదు, ఇక్కడి తెలంగాణ యువత పడుతున్న ఆవేదన, బాధ అస్సలు అర్థం కాదు. అందుకే మీకు బాగా అర్థమయ్యే మీ హిందీ భాషలోనే అడుగుతున్నా" అన్నారు.

దేశమంతా రాజ్యాంగం పట్టుకుని ప్రజాస్వామ్యం గురించి మాయమాటలు చెప్పే రాహుల్ గాంధీ తెలంగాణలోని నిరుద్యోగుల వీపుల పైన పోలీస్ లాఠీలు మోగుతుంటే...అక్రమ కేసులతో ఆడబిడ్డలను కూడా చూడకుండా అణిచివేస్తుంటే రాహుల్ గాంధీ ఏం చేస్తున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో జరుగుతున్న అప్రజా స్వామిక అరాచక అణిచివేత చూడకుండా కళ్ళు మూసుకొని ఢిల్లీలో గుడ్డి గుర్రాల పండ్లు తోముతున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ కాలాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని తమకు ఇచ్చిన హామీల అమలును ఉద్యోగాల భర్తీ గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తే ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో వేధింపులతో అవహేళనతో అణిచివేతకు గురి చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం పైన కేటీఆర్ మండిపడ్డారు.

**నోటిఫికేషన్లు లేవు.. సాగుతున్నదంతా 'లూటీఫికేషన్'**

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన 'యూత్ డిక్లరేషన్' హామీల పరిస్థితి ఏమైందని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఇస్తామన్న 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఏమయ్యాయో చెప్పాలన్నారు. జాబ్ క్యాలెండర్ తో పాటు 4,000 నిరుద్యోగ భృతి ఏదని ప్రశ్నించారు. లక్షలాది మంది అభ్యర్థులు కొలువుల కోసం రోడ్లపైకి వస్తుంటే, ఈ ప్రభుత్వం ఉద్యోగాల 'నోటిఫికేషన్' ఇవ్వడం పక్కనబెట్టి, కేవలం 'లూటీఫికేషన్' (దోపిడీ) లో మునిగిపోయిందని ఆరోపించారు.

అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ. 4,000 నిరుద్యోగ భృతి, కాలేజీ అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, రూ. 10 లక్షల వడ్డీ లేని రుణాలు అంటూ కాంగ్రెస్ ఇచ్చిన 24 హామీలలో ఒక్కటైనా నెరవేరిందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో 'ఓటు కొట్టు.. జాబ్ పట్టు' అని పత్రికల మొదటి పేజీల్లో ఫుల్ పేజ్ ప్రకటనలు ఇచ్చిన కాంగ్రెస్, నేడు ఏడాది దాటినా జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదన్నారు.

రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు రావడం లేదు కానీ, రేవంత్ రెడ్డి బినామీల బీరువాలు నిండుతున్నాయని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నింపే పనిలో బీజీగా ఉన్న రేవంత్ రెడ్డి, ఇంక జాబులు ఎక్కడి నుంచి ఇస్తారని ఎద్దేవా చేశారు. అశోక్ నగర్, దిల్ షుక్ నగర్ వేదికగా కొలువులు అడుగుతున్న నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి సర్కార్ లాఠీఛార్జీలు, అర్ధరాత్రి అరెస్టులతో దమనకాండ సాగిస్తోందని మండిపడ్డారు. ఉద్యోగాలు అడిగితే "ఎండ్రిన్ తాగి చావండి, బావిలో దూకండి" అన్న రేవంత్ అహంకారానికి రాబోయే రోజుల్లో యువత ఘోరి కట్టడం ఖాయమన్నారు.

**70 వేల ఉద్యోగాలపై రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్**

బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను తమ ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ చోరీ చేస్తున్న రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు రేవంత్ రుజువు చేస్తే.. తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని కేటీఆర్ సవాల్ చేశారు. ఉద్యోగాలపై కాంగ్రెస్ నాయకులు కాకి లెక్కలు చెప్తూ నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇకపై మరొక లెక్క కాంగ్రెస్ చేస్తున్న మోసాలను చూస్తూ కూడా తెలంగాణ మేధావులు మౌనంగా ఉండడం ఆవేదన కలిగిస్తోందన్నారు. "జీనా హై తో మర్నా సీఖో.. కదమ్ కదమ్ పర్ లడ్నా సీఖో" అంటూ కొట్లాడిన యువతరం ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే పాలకుల కుర్చీలు కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు.

విద్యార్థులను కేసుల్లో ఇరికించి వారి భవిష్యత్ ను దెబ్బతీసే పనులను బీఆర్ఎస్ ప్రోత్సహించదన్న కేటీఆర్, ప్రజాస్వామ్యయుతంగానే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడతామని తెలిపారు.

"యువతకు ఏ కష్టం వచ్చినా ఒక అన్నగా, సోదరుడిగా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. 2028లో ఖచ్చితంగా మళ్ళీ కేసీఆర్ గారే ముఖ్యమంత్రి అవుతారు. రాబోయే ప్రభుత్వంలో యువత ఆకాంక్షలకు న్యాయం చేసే బాధ్యత నాది" అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

ఈ రోజు యువతను దారుణంగా మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని కూడా నిరుద్యోగుల తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎలాంటి దుర్మార్గులకి, మోసకారి నాయకులకి పార్టీకి ఓటు వేసి గెలిపించుకున్నారో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. పంటలకు నీళ్లు అడిగితే కోసి నెత్తురు చల్లుకోండి అంటున్నాడు మరోవైపు బిడ్డలు కొలువులు అడిగితే ఎండ్రిన్ తాగి చాగ తాగండి బాయిలో దూకండి అంటున్నారు. ఇంతటి ఉన్మాదం, అహంకారం తలకెక్కిన దుర్మార్గుడికి ఓట్లు వేసిన విషయాన్ని గుర్తుంచుకొని తగిన సమయంలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ నుంచి మొదలుకొని డీఎస్సీ వరకి అన్ని అంశాల్లో చెప్పిన మాటలు మరిచి నిరుద్యోగులను మోసం చేస్తున్న రేవంత్ రెడ్డిని నిలదీస్తే నిరుద్యోగులను పెయిడ్ ఆర్టిస్టులు శంకినీలు అంటూ అడ్డగోలుగా అవమానకరంగా మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. డీఎస్సీ మెగా డీఎస్సీ వేస్తా అన్న రేవంత్ రెడ్డి, వేసిన డీఎస్సీ కూడా ఇంత అడ్డగోలుగా మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి అహంకారం, బలుపు మాటలను తెలంగాణ యువత మరిచిపోదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

మాయ చేసి మోసం చేస్తే కాంగ్రెస్ వలలో పడే అమాయకులు తెలంగాణ యువకులు కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఒకనాడు యూనివర్సిటీలో జీనా హైతో మర్నా సీకో కదం కదం పర్ లడనా సీకో అంటూ గట్టిగా కొట్లాడిన యువతరాన్ని వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీయాలని చూస్తే గుణపాఠం తప్పదన్నారు. యూనివర్సిటీ విద్యార్థులను బీరు బిర్యానీ బ్యాచ్ అంటూ అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ భూములను కూడా అమ్ముకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు అన్నారు.

ఇంతటి నీచమైన మనస్తత్వం కలిగిన ముఖ్యమంత్రిని నిరుద్యోగ యువత ఏమాత్రం క్షమించదని హెచ్చరించారు. యువతకి కాంగ్రెస్ పైన పొట్టు పొట్టు కోపం ఉన్నదని ఓటు పెట్టుకొని మరి కాంగ్రెస్ కి గోరీ కడతారన్నారు. రేవంత్ రెడ్డి తాను నమ్ముకున్న నీ అంతా హిట్లర్ కంటే దారుణమైన ముగింపును చూడబోతున్నారన్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు పది సంవత్సరాల కాలంలో ఉద్యోగాల భర్తీ విషయంలో చాలా సిన్సియర్ గా పని చేశామన్నారు.

2,32,000 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించామన్నారు, దీంతో పాటు దాదాపు 27 లక్షల ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. అయితే టీఎస్పీఎస్సీ వంటి వ్యవహారంలో పేపర్ లీక్ వ్యవహారంలో మరింత వేగంగా స్పందించాల్సి ఉండేదని కేటీఆర్ అన్నారు. గతంలో ఏవైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సవరించుకుంటామని, ఖచ్చితంగా వచ్చే ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వంలో యువత ఆలోచనలకు, అవకాశాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆనాడు టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ లో కూడా తమ ప్రభుత్వమే పట్టుకున్నదని అదేదో పేపర్ లీక్ అయిందంటూ అడ్డగోలుగా దుష్ప్రచారం చేసి ప్రాపగండా చేశారని అన్నారు. 1,62,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన తాము ఏనాడు గొప్పలు చెప్పుకోలేదు అన్నారు. కాంగ్రెస్ మాదిరి కల్లబొల్లి మాటలు కాకి లెక్కలు చెప్పలేదు అన్నారు. ఏనాడు సభలు పెట్టి సర్టిఫికేట్లు పంచలేదు మొదటి పేజీలో ప్రకటనలు ఇవ్వకుండా తమ పని తాము చేసుకుంటూ పోయామన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం అడ్డగోలుగా అబద్ధాలు అపనిందలతో యువత మనసుల్లో విద్వేషం నింపిందన్నరు. ఉద్యోగాల భర్తీ అంశంలో కాంగ్రెస్ పార్టీతో చర్చకు తాను సిద్ధం అని కేటీఆర్ సవాలు విసిరారు. యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసం పైన తెలంగాణ సమాజంలోని మేధావులు మౌనంగా ఉండడం పైన కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నర సంవత్సరాలుగా తెలంగాణ యువతకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడ్డది ముమ్మాటికి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వమే పార్టీనే అని కేటీఆర్ అన్నారు. ఇకపైన కూడా తాను ఒక సోదరుడిగా అండగా ఉంటానని కేటీఆర్ భరోసా ఇచ్చారు. యువతకు ఏ కష్టం వచ్చినా ఒక అన్నగా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ రోజు కాంగ్రెస్ పార్టీ పాలనలో తెలంగాణలో కేవలం చందాలు దందాలు అనే కల్చర్ నడుస్తుంది అని పారిశ్రామికవేత్తల తలలకు తుపాకులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు, అందుకే ఐటీ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు పోతున్నాయని కేటీఆర్ అన్నారు.

మరోవైపు బీజేపీ తెలంగాణకు వచ్చే పెట్టుబడులను పరిశ్రమలను తన్నుకు పోతున్నదని ఇదేనా జాతీయవాదం అని బీజేపీని ప్రశ్నించారు. నిరుద్యోగ విద్యార్థుల కష్టాలు, వారు ప్రిపరేషన్ సందర్భంగా పడే బాధలు తానుకు తెలుసు అన్నారు, వారి ఆకలి అవస్థలు పట్ల నాకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు, నిరుద్యోగ యువకుల తల్లిదండ్రుల ఆకాంక్షలు కూడా తెలుసు అన్నారు. అందుకే రానున్న రోజుల్లో వారందరికీ ఒక అన్నగా అండగా ఉండి వారి ఆకాంక్షల కోసం వారి అవకాశాల కోసం పోరాటం చేస్తానని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

ఒక విద్యార్థిగా అనేక పరీక్షలు రాసి పూణే తో పాటు న్యూయార్క్ యూనివర్సిటీ వరకు సీట్లు సాధించి ఎవరి పైరవీలు లేకుండా ఉద్యోగం సాధించుకున్న తనకు ఉద్యోగ సాధన ఇంత కష్టమైనదో దాని కోసం ఎన్ని కష్టాలు పడాల్సి వస్తుందో తెలుసు అన్నారు. కానీ ఎలాంటి ఉద్యోగాల కోసం ఒక్క రోజు కూడా ప్రయత్నం చేయని రేవంత్ రెడ్డి, బండి సంజయ్ లాంటి వాళ్లు అడ్డగోలుగా విద్యార్థుల పైన మాట్లాడుతున్న అంశం పైన కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు అక్రమాలు చేసినా తాను నేపాల్ మాదిరి ఒక విధ్వంసానికి పిలుపు ఇవ్వడం లేదు అని, కేవలం ప్రజాస్వామికంగా కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతూ వారి పైన పోరాటం చేయాలని మాత్రమే పిలుపునిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. కేవలం విద్యార్థులను కేసుల్లో ఇరికిచ్చి రాజకీయాలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఏనాడు ఆలోచించదు అన్నారు. ఒకవైపు తమ భవిష్యత్తు గురించి ఆలోచించుకుంటూనే భవిష్యత్తును నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల భర్తీ తో పాటు జాబ్ క్యాలెండర్ల వంటి అన్ని అంశాల్లో యువతకు సంబంధించి అన్ని ఆకాంక్షలను పరిగణలోకి తీసుకొని ఒక అన్నగా ముందుకు పోతామని వారి వెంట నిలుస్తానని భరోసా ఇచ్చారు. మరోవైపు టి హబ్ స్టార్టప్ అయిన స్కైరూట్ సంస్థ ఈ రోజు ప్రయోగించిన మొదటి రాకెట్ ప్రయోగానికి సంబంధించిన విజయాన్ని అందరూ అభినందించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన నిరుద్యోగ యువత కాంగ్రెస్ తమకు చేసిన ద్రోహాన్ని వివరించారు. ఇక ఈ సదస్సుకు హాజరైన బీఆర్ఎస్ సీనియర్ నేతలు సభాప్రాంగణం చివరలో కూర్చుని, ముందు వరుసల్లో యువతను కూర్చోబెట్టడం పలువురిని ఆకర్షించింది.

# తెలంగాణలో పర్మనెంట్ రెసిడెంట్ సర్టిఫికెట్

హైదరాబాద్ జూలై 18 తెలంగాణలో కర్ణాటక రాష్ట్రం తరహాలో శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం విధానాన్ని ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోందని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ వెల్లడించారు. ఈ కొత్త విధానం సాధ్యసాధ్యాలను సమగ్రంగా పరిశీలించడానికి ఒక మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దీర్ఘకాలంగా నివసిస్తున్న ప్రజలు తమ శాశ్వత నివాసాన్ని సులభంగా నిరూపించుకోవడానికి వీలుగా ఒక ప్రామాణిక ప్రభుత్వ పత్రాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి షబ్బీర్ అలీ వినతిపత్రం సమర్పించారు.షబ్బీర్ అలీ అందించిన ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రాథమికంగా చర్చించారు. కర్ణాటకలో అమలులో ఉన్న పి.ఆర్.సి విధానాన్ని, దాని ఫ్రేమ్‌వర్క్‌ను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అలాంటి వ్యవస్థను తీసుకురావడానికి ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. ఓటర్ల వెరిఫికేషన్ సమయంలో పరిశీలించదగిన పత్రాల జాబితాలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం కూడా ఒకటని షబ్బీర్ అలీ గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తి పరిశీలన తర్వాత అధికారికంగా జారీ చేసే పి.ఆర్.సి, ఓటర్లు తమ అర్హతను నిరూపించుకోవడానికి ఒక బలమైన మద్దతు పత్రంగా ఉపయోగపడుతుందని వివరించారు.ఈ కొత్త నివాస ధ్రువీకరణ పత్రం వస్తే చాలా ప్రయోజనకరంగా ఉండనుంది. 2002 నాటికి ఓటు హక్కు వయసు లేని వారికి ఇది నివాస ఆధారంగా మారుతుంది. వివాహం తర్వాత పేర్లు, చిరునామాలు మారిన మహిళలకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఒక నియోజకవర్గం లేదా జిల్లా నుండి మరొక ప్రాంతానికి మారిన కుటుంబాలకు నివాస ధ్రువీకరణ సులువవుతుంది. పాత రికార్డులలో పేర్ల స్పెల్లింగులు లేదా అనువాద లోపాల వల్ల తమ వివరాలను కనుగొనలేకపోతున్న నివాసితులకు ఈ పత్రం ద్వారా మేలు జరుగుతుంది.

# కమలానికి ట్రబుల షూటర్ కావలెను...

హైదరాబాద్, జూలై 18తెలంగాణ రాజకీయ చిత్రపటంపై కమలం పార్టీ వేగంగా విస్తరిస్తోంది. గత కొన్ని ఎన్నికల సరళిని గమనిస్తే బీజేపీ ఓటు బ్యాంకు, సీట్ల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఒకప్పుడు నామమాత్రపు ఉనికికే పరిమితమైన పార్టీ, నేడు 8 పార్లమెంటు స్థానాలను గెలుచుకునే స్థాయికి చేరిందంటే రాష్ట్రంలో ఆ పార్టీ ప్రాభవం ఎంతలా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలను చూసిన తెలంగాణ ఓటర్లు? కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని, పార్టీ అందిస్తున్న హిందుత్వ నినాదాన్ని నమ్మి ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే, ఇంత సానుకూల వాతావరణం ఉన్నా, రేపటి ఎన్నికల్లో అధికారం హస్తగతం చేసుకోవాలనే బీజేపీ కల నిజమవ్వడానికి ఒక పెద్ద అడ్డంకి పదే పదే తెరపైకి వస్తోంది. అదే? సమర్థవంతమైన, రాష్ట్ర స్థాయి 'మాస్ లీడర్' లేకపోవడం.ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో ఓటు బ్యాంకు పెరుగుతున్న మాట వాస్తవమే అయినా, దానిని క్షేత్రస్థాయిలో ఓట్లుగా మార్చి పోలింగ్ బూత్ వరకు నడిపించే బలమైన వ్యూహకర్త, ప్రజాకర్షక నాయకుడు కరవ-య్యారు. ప్రత్యర్థి పార్టీలను గమనిస్తే? కాంగ్రెస్‌కు రేవంత్ రెడ్డి లాంటి దూకుడున్న మాస్ లీడర్ ఉన్నారు. బీఆర్ఎస్ వైపు చూస్తే కేసీఆర్ చరిష్మాతో పాటు కేటీఆర్, హరీశ్ రావు లాంటి వాగ్ధాటి, జనాలను ఆకట్టుకునే నేతలున్నారు. కానీ బీజేపీలో మైకు పడితే జనాలను తనవైపు తిప్పుకుని, అధికార పీఠం వైపు నడిపించగల అగ్రనేత ఎవరనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు.ప్రస్తుతానికి రాష్ట్రంలో ఉన్న కిషన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సౌమ్యులుగా ముద్రపడ్డారు. క్లిష్టమైన రాజకీయ పోరాటాల్లో ఇలాంటి సౌమ్యత పార్టీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లలేకపోతోంది. మరోవైపు బండి సంజయ్ మాటలు, లక్ష్మణ్ లాంటి నేతల ఉపన్యాసాలు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లను పూర్తి స్థాయిలో సమ్మోహన పరచలేకపోతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే స్థానిక నేతలు బలంగా ఉన్నారు. దాదాపు 30 స్థానాల్లో మినహా, మిగిలిన చోట్ల కేవలం నరేంద్ర మోదీ ముఖాన్ని చూసి లేదా పార్టీ సిద్ధాంతాన్ని చూసి ఓట్లేయాల్సిన పరిస్థితి ఉంది.పట్టణ ప్రాంతాల్లో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్థానిక నాయకత్వ బలం, ప్రజల్లో నిరంతరం ఉండే మాస్ లీడర్ చరిష్మా మాత్రమే ఓట్లను రాల్చగలవు. ఈ బలహీనతను పసిగట్టే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాంటి ప్రత్యర్థి నేతలు ఢిల్లీ వేదికగా సైతం "తెలంగాణలో బీజేపీకి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు" అని ధీమాగా సవాల్ విసరగలుగుతున్నారు. ఓటు బ్యాంకు ఉన్నా, దానికి సరైన దిశా నిర్దేశం చేసే నాయకత్వం లేకపోతే ఎన్నికల రేసులో వెనుకబడక తప్పదనే విషయం కమలనాథులకు అర్థమవుతోంది.ఈ నేపథ్యంలోనే బీజేపీ జాతీయ అధిష్టానం ఇప్పుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలు, మోదీ ఇమేజ్‌పైనే ఆధారపడకుండా? తెలంగాణ మట్టి వాసన తెలిసిన, దూకుడుగా ఉంటూ ప్రజలను ఉర్రూతలూగించగల ఒక సమర్థవంతమైన 'మాస్ లీడర్' కోసం అధిష్టానం వేట మొదలుపెట్టింది. లీడర్షిప్ లోపాన్ని సవరించుకుంటేనేవచ్చే ఎన్నికల్లో అధికారం సాధించడం సాధ్యమవుతుందని అటు పార్టీ శ్రేణులు, ఇటు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నాయకత్వ లోటును బీజేపీ ఎంత త్వరగా భర్తీ చేస్తుందనే దానిపైనే ఆ పార్టీ తెలంగాణ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## నేడు రవీంద్రభారతిలో తెలంగాణ బోనాల జాతర 2026

## సిరి ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు ఏకవీర




హైద్రాబాద్ జులై 18 :ఈ నెల 19 ఆదివారం ఉదయం రవీంద్రభారతిలో తెలంగాణ బోనాల జాతర 2026 మ్యూజిక్ డాన్స్ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సిరి ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు ఏకవీర తెలిపారు.

నృత్య మాల నాట్య కళ వెల్ఫేర్ సొసైటీ సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ తెలంగాణ బోనాల జాతర 2026 మ్యూజికల్ నృత్య నాట్య కళ ప్రదర్శనకు

సంబంధించి కరపత్రాన్ని శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య విడుదల చేశారు ఈ సందర్భంగా ఏకవీర మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బోనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని బోనాల జాతరకు సంబంధించి తమ అకాడమీ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు అలాగే ఈ కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, సినీనటి కరాటే కళ్యాణి ప్రముఖ నాట్య గురువులు పాల్గొన్నారు ఆయన తెలిపారు

# తెరపైకి ప్రాజెక్టు మేఘాలయ

చెన్నై, జూలై 18, తమిళనాడులో హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగిందన్న ఆరోపణలు ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ప్రాజెక్ట్ మేఘాలయ పేరుతో కొందరు వ్యక్తులు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు భారీగా నగదు ఆశచూపి వారిని తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నించినట్లు చెన్నై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగా దాదాపు 15 మంది టీవీకే ఎమ్మెల్యేలను సంప్రదించే ప్లాన్ లో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఊతంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్.ఇళయరాజా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఐపీడీఎస్ అనే ఒపీనియన్ పోలింగ్ సంస్థను నడుపుతున్న యూట్యూబర్ తిరునావుక్కరసు తనకు రూ.35 కోట్ల ఆఫర్ చేశాడని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పార్టీ విప్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఓటు వేయాలని వారు కోరారని, దానికి తాను అంగీకరించకపోవడంతో తనతో పాటు తన కుటుంబ సభ్యులను కూడా బెదిరించారని ఎమ్మెల్యే ఆరోపించారు.ఎమ్మెల్యే ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసులో ఇప్పటివరకు 9 మందిని అరెస్ట్ చేశారు. ఇదే క్రమంలో ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ని కూడా జులై 15, 16 తేదీల్లో విచారించి ఆయన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు తిరునావుక్కరసుతో ఆయన సంప్రదింపులు జరిపినట్లు ఆధారాలు లభించాయని పోలీసులు చెబుతున్నారు. అయితే సరైన విధానాన్ని పాటించకుండా ఓ జర్నలిస్టును అర్ధరాత్రి వరకు విచారించారని చెన్నై ప్రెస్ క్లబ్ ఆరోపిస్తూ పోలీసుల చర్యను తీవ్రంగా ఖండించింది. పోలీసులు మాత్రం చట్టప్రకారమే దర్యాప్తు కొనసాగిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు.ఈ కేసు దర్యాప్తులో భాగంగా మాజీ మంత్రి, డీఎంకే నేత సెంథిల్ బాలాజీతో పాటు ఆయన సోదరుడు అశోక్‌కు కూడా పోలీసులు సమన్లు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయంగానూ చర్చనీయాంశంగా మారింది. అయితే తమపై వస్తున్న ఆరోపణలను డీఎంకే పూర్తిగా ఖండించింది.

# మహేష్ గౌడపై వేటు తప్పదా

హైదరాబాద్, జూలై 18 తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించినప్పటికీ.. పార్టీ అంతర్గత వ్యవహారాలు మాత్రం గాంధీభవన్‌ను కుదిపేస్తున్నాయి. రోజురోజుకూ పెచ్చుమీరుతున్న గ్రూపు రాజకీయాలు, అంతర్గత కుమ్ములాటలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో పార్టీలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను సమన్వయపరిచే ఒక సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పగ్గాలను మార్చడం ఒక్కటే దీనికి పరిష్కారమనే చర్చ ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది.ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు కాంగ్రెస్ హైకమాండ్‌కు తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డులో జూనియర్లకు పదవులు కట్టబెట్టి, పార్టీని నమ్ముకున్న సీనియర్లకు మొండిచేయి చూపించారనే అసంతృప్తి బహిరంగంగానే వ్యక్తమవుతోంది. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో కనీసం తమకు సమాచారం లేకుండానే నియామకాలు జరగడంపై సీనియర్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్న సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ పూర్తిగా విఫలమయ్యారంటూ సీనియర్లు భావిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలోనే పరిష్కరించాల్సిన ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌ను గాడిలో పెట్టాలంటే నాయకత్వ మార్పు అనివార్యమనే సంకేతాలు అందుతున్నాయి. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ తీవ్రంగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టి, పార్టీ కేడర్‌లో భరోసా నింపే కొత్త సారథి కోసం అన్వేషణ మొదలైనట్లు టాక్. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, పీసీసీ పగ్గాలు ఎవరికి దక్కుతాయో చూడాలి.

ముదురుతున్న గొడవలు

తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టినప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పూర్తి స్థాయిలో ప్రభుత్వ పాలనపై, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ.. పార్టీ వ్యవహారాలను చక్కదిద్దే బలమైన నాథుడు కరువవడంతో గాంధీభవన్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. భిన్న ధృవాలుగా ఉండే సీనియర్ నేతలను, విభిన్న వర్గాలను ఒక తాటిపైకి తెచ్చే బలమైన సమన్వయకర్త లేకపోవడం వల్లే పార్టీలో ఈ అంతర్గత సంక్షోభం ముదురుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధిష్టానానికి తీవ్ర తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు నియామక ప్రక్రియ పార్టీలో పెద్ద దుమారమే రేపింది. ఈ బోర్డు నియామకంలో తమకు సరైన ప్రాధాన్యత దక్కలేదని, జూనియర్లకు పదవులు కట్టబెట్టారని పార్టీ కోసం ఎప్పటి నుంచో నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాల్లో తమకు తెలియకుండానే నియామకాలు జరగడంపై వారు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తపరుస్తున్నారు. ఈ వివాదం సద్దుమణగక ముందే, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యవహారం పార్టీని మరింత రక్షణలో పడేసింది. ఒక కీలకమైన బీసీ నేతను ఉద్దేశించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం సృష్టించాయి. సామాజిక సమీకరణాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన తెలంగాణ వంటి రాష్ట్రంలో, బలమైన బీసీ వర్గానికి చెందిన నేతపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ సాంప్రదాయానికి విరుద్ధమని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు. ఈ వ్యవహారం పార్టీ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా, అంతర్గత కుల సమీకరణాల ఘర్షణకు దారితీస్తోంది.మరోవైపు, తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక పంచాయతీ ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌కే చేరింది. స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, ఆధిపత్య పోరు కారణంగా గాంధీభవన్ వేదికగా ఇరువర్గాలు గందరగోళానికి దిగడం, వాగ్వాదానికి దారితీయడం మీడియాలో హాట్ టాపిక్ అయింది. దీనికి తోడు సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వైఖరి, ఆయన అనుసరిస్తున్న సొంత లైన్ పార్టీకి నిరంతరం సవాల్‌గా మారుతూనే ఉంది. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు పాత కాంగ్రెస్ శ్రేణుల మధ్య సరైన సమన్వయం కుదరకపోవడంతో క్యాడర్ తీవ్ర అయోమయానికి లోనవుతోంది.ఈ మొత్తం సంక్షోభానికి ప్రస్తుత పీసీసీ నాయకత్వ శైలి, మేనేజ్‌మెంట్ లోపమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీలో వస్తున్నా సమస్యలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో, నేతల మధ్య రాజీ కుదర్చడంలో పీసీసీ చీఫ్ సామర్థ్యం సరిపోవడం లేదంటూ సీనియర్లు భావిస్తున్నారు. సమస్యల తీవ్రతపై నివేదికలు సిద్ధం చేసి, రాష్ట్ర స్థాయిలోనే సెటిల్ చేయాల్సింది పోయి.. ప్రతి చిన్న విషయానికి ఢిల్లీ వైపు చూడటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ పనితీరుపై అసంతృప్తిగా ఉన్న పలువురు సీనియర్ నేతలు నేరుగా ఏఐసీసీ హైకమాండ్‌కు లిఖితపూర్వక ఫిర్యాదులు పంపినట్లు సమాచారం.తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలను మార్చాలనే ప్రచారం ఢిల్లీ పీఠం నుండి గల్లీ వరకు జోరుగా సాగుతోంది. పాలనలో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి అండగా ఉంటూ, ఇటు పార్టీని క్రమశిక్షణతో నడపగలిగే ఒక సీనియర్, అందరికీ ఆమోదయోగ్యుడైన నేతకు పీసీసీ చీఫ్ పదవి అప్పగించాలని హైకమాండ్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉండి కూడా నిరంతరం వివాదాలతో సాగుతున్న తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

## ఎల్ నినో ఎఫెక్ట్... పెరిగిన కరెంట్ బిల్లు....

## గృహజ్యోతినుంచి 4 లక్షల మంది ఔట్

హైదరాబాద్, జూలై 18, తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేద కుటుంబాలకు గృహ్యజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో చాలా మంది జీరో కరెంటు బిల్లు వస్తోంది. అయితే వేసవిలో కొందరు కూలర్లు, ఏసీలు వాడడంతో 200 యూనిట్లు దాటి బిల్లు చెల్లిస్తున్నారు. వర్షాకాలం రాగానే మళ్లీ జీరో బిల్లుతో లబ్ది పొందుతున్నారు. అయితే ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవడం లేదు. దీంతో రైతులు ఇప్పటికే ఇబ్బంది పడుతున్నారు. తాజాగా దీని ప్రభావం గృహజ్యోతి లబ్ధిదారులపైనా పడింది. వాతావరణ వ్యత్యాసాలతో గృహజ్యోతి లబ్ధిదారులు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో కూడా అసాధారణ ఎండలు, ఉక్కపోత కారణంగా గృహ విద్యుత్ వినియోగం పెరగడంతో అనేక మంది లబ్ధిదారులు అర్హత కోల్పోతున్నారు.ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్)పరిధిలోనే సుమారు నాలుగు లక్షల మంది లబ్ధిదారులు పథకంతో లబ్ధి పొందలేకపోయారు. మొత్తం 26.54 లక్షల మంది నమోదైన వారిలో కేవలం 22.59 లక్షల మందికి మాత్రమే జీరో బిల్లు వచ్చింది. ఇతర విద్యుత్ సర్కిళ్లలో కూడా అనర్హుల సంఖ్య భారీగా ఉందని సమాచారం.సాధారణంగా వర్షాకాలంలో ఉష్ణోగ్రతలు తగ్గి, విద్యుత్ వినియోగం తగ్గుతుందని అంచనా. కానీ ఎల్‌నినో ప్రభావంతో ఈ సమతుల్యత దెబ్బతింటోంది. అధిక ఎండలు, ఉక్కపోత కారణంగా ఫ్యాన్లు, ఏసీలు ఎక్కువగా వాడటం వల్ల చాలా గహాల్లో విద్యుత్ వినియోగం 200 యూనిట్ల పరిమితిని అధిగమించింది. ఇది పథకం రూపొందించిన సమయంలో ఊహించని వాతావరణ పరిస్థితుల వల్ల ఏర్పడిన సవాలు.పథకం నుంచి బయటకు వచ్చిన వారికి నెలవారీ విద్యుత్ బిల్లులు వస్తాయి. తక్కువ ఆదాయ కుటుంబాలకు ఇది అదనపు ఆర్థిక భారం. జూన్ నెలలోనే లక్షలాది మంది ఈ షాక్‌ను ఎదుర్కొన్నారు. జూలై నెలలో కూడా ఇలాంటి పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనాలు. దీంతో పథకం యొక్క ప్రయోజనం తగ్గిపోతూ, లబ్ధిదారుల విశ్వాసం కూడా ప్రభావితం అవుతుంది.ఈ పరిణామం కేవలం ఒక పథకానికి మాత్రమే పరిమితం కాదు. వాతావరణ మార్పులు ఇతర సంక్షేమ కార్యక్రమాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈఏపథ్యంలో గృహాల్లో విద్యుత్ సామర్థ్యం గల ఉపకరణాల వాడకం, అనవసర వినియోగం తగ్గించడం వంటి అలవాట్లు ప్రోత్సహించాలి. ఇళ్లలో ఇన్సులేషన్, ఎనర్జీ ఎఫిషియెంట్ ఫ్యాన్లు వంటి చర్యలు తీసుకోవాలి.

# త్వరలో జరగబోయే ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో టీజేఎంయూ గెలిపించాలి ..



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 18(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**జహీరాబాద్/త్వరలో జరగబోయే ఆర్టీసీ యూనియన్ ఎన్నికల సందర్భంగా జహీరాబాద్ డిపోలో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ను గెలిపించాలని టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, టీజేఎంయూ గౌరవాధ్యక్షులు టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోఫాజి అనంత కిషన్



ఆర్టీసీ ఉద్యోగులను కోరారు,గత 10 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్ ఆర్టీసీని వంచించి మోసం చేశారని ఆయనకు మీరు తగిన బుద్ధి చెప్పడం జరిగిందని ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు ఒక్కొక్కటిగా అన్ని నెరవేర్చడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పూర్తిగా ఆర్టీసీని ఆదుకుంటున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్ని సమస్యలపై పరిష్కరిస్తున్నారు అని మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తారని తెలిపారు,తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆవిర్భావం 2017 నుండి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని 2019 లో కార్మిక చైతన్యత చేసి ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్ని డిపోలలో పర్యటించి పోరాటం చేసిందని ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నందుకు మరి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కావాలంటే జరగబోయే ఆర్టీసీ ఎన్నికల్లో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు,2017 ఆవిర్భావం నుండి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేసిన యూనియన్ తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ అని అదే విధంగా 2019లో 97 డిపోలలో కార్మిక చైతన్య యాత్ర చేస్తూ ప్రభుత్వంలో విలీనం చేయాలని మొట్టమొదటి సమ్మె నోటీసులు ఇచ్చిన యూనియన్ టీజేఎంయూ అని విలీనం గురించి అలుపేరని అలుపెరుగని పోరాటం చేసిన యూనియన్ అని టీజేఎంయూ అని అందుకే ఈ యొక్క యూనియన్ కు ఓటు వేయాలని కోరారు,ప్రభుత్వంలో విలీనం అయితే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న వసతులతో పాటు సమాజంలో గౌరవం విలువ పెరుగుతాయని అన్నారు,ఈ కార్యక్రమంలో టీజేఎంయూ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పల్లె కృష్ణమూర్తి, సంగారెడ్డి రీజినల్ సెక్రటరీ అంజయ్య గౌడ్, హైదరాబాద్ సిటీ రీజినల్ సెక్రెటరీ బుల్లెట్ పాండు, జహీరాబాద్ డిపో అధ్యక్షులు జిలాని,డిపో కార్యదర్శి నరసింహ, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ శశికుమార్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ అనిల్ కుమార్,ఎంఎస్ రెడ్డి జాయింట్ సెక్రెటరీ, నరేష్ అసిస్టెంట్ సెక్రటరీలు రాజయ్య గౌడ్, సంయోద్దీన్, పి రాములు ఆర్గనైజ్ సెక్రెటరీ రాజు, పబ్లిసిటీ సెక్రటరీ ఎండి అశ్వక్, గ్యారేజ్ సెక్రటరీ శ్రావణ్, ట్రెజరర్ ప్రభాకర్, డెలిగేట్స్ మోయిన్, నవీన్ కుమార్, ఐఎస్ రెడ్డి, సంగారెడ్డి డిపో సెక్రెటరీ విక్రమ్, జాయింట్ సెక్రెటరీ రవీందర్, సలహాదారులు విట్టల్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్, డెలిగేట్ ఆంజనేయులు, శ్రీనివాస్ మైనార్టీ అధ్యక్షుడు, మైనార్టీ అధ్యక్షుడు వాహిద్ పాషా, తదితరులను పాల్గొన్నారు.

# మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి... జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 18(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి,అనుమానితులను సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేసే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు,శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ,ఎస్ ఈ ఆర్ పి, శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియా, సంస్థల సమన్వయంతో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు, ముందస్తు నిర్ధారణ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు,జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ,ఎస్ ఈ ఆర్ పి, తో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు,గ్రామీణ ప్రాంత మహిళలకు రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు పరీక్షల అవసరంపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాల నిర్వహణలో ,ఎస్ ఈ ఆర్ పి, శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియాకు అధికారులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు,ఈ కార్యక్రమం ద్వారా మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు,ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి , జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.లలితా దేవి , డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విల్లాలో అర్ధరాత్రి హంగామా

మేడ్చల్ పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అశోక అలమైసన్ గేటెడ్ కమ్యూనిటీ (విల్లాస్ )లో అర్ధరాత్రి కొంతమంది వ్యక్తులు హంగామా సృష్టించారు. తమ విల్లాస్ లో గల పార్కు స్థలంలో ఉన్న బోరుబావి ని రిపేర్ చేస్తున్న క్రమంలో మైనంపల్లి చందర్ రావు మరికొంత మంది కలసి పార్క్ స్థలం తమదని అందులో ఎలాంటి యాక్టివిటీ వేయొద్దు అంటూ ?విల్లాస్ లో ఉండే వారిపై దాడి కి పాల్పడ్డారు. గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న సెక్యూరిటీని సైతం బెదిరించి బైట కొందరి రౌడీ మూకలతో వచ్చి భయభ్రాంతులకు గురిచేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు,ఆడవారు అనే కనీసం మర్యాద లేకుండా ప్రవర్తించారని,ప్రశాంతంగా ఉండటం కోసం విల్లాస్ ను కొనుగోలు చేసి,జీవిస్తుంటే ఇలా తమపై దాడికి పాల్పడటం దారుణమని అన్నారు. ఈ విషయం పై పోలీసులకి సమాచారం అందడంతో అక్కడ సెక్యూరిటీ గార్డుల పై,స్థానికుల పై దాడి కి యత్నించిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయం పై తమకు భద్రత పరమైన ఇబ్బందులు ఉన్నాయని,పోలీసు అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఈ నెల 20న ఎల్‌నినో పై సమీక్ష సమావేశం...

## ఉమ్మడి మెదక్ జిల్లా ఎల్‌నినో సమీక్షకు సర్వం సిద్ధం చేయాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 18(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు,శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఈ నెల 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్న సమీక్ష సమావేశాల



నిర్వహణపై పలు సూచనలు చేశారు,ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల సమన్వయంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రుల అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయిలో సమగ్ర సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు,ఈ సమావేశాల్లో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలాశయాల నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, తాగునీటి పంపిణీ, నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు,వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 20న జరిగే ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖలు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత,జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ, ఉద్యాన పంటల స్థితిగతులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక,భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా,నీటి సంరక్షణ చర్యలు తదితర అంశాలపై శాఖల వారీగా సమగ్ర వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసి సమావేశంలో సమర్పించాలని అధికారులకు సూచించారు,ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఓ (పీడీ) జ్యోతి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# సత్తుపల్లి అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లో అధికారులతో ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ భేటీ



**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి జూలై 18:** సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

విద్యాశాఖ ప్రభుత్వ సహాయ కార్యదర్శి ఎస్. శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు చెందిన మంత్రి పేషీ అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన డాక్టర్ మట్టా దయానంద్, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.



# వృద్ధుని వైద్యానికి వెస్సో రూ.51 వేల సహాయం




హైద్రాబాద్ జులై 19; మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న తూర్పు గోదావరి జిల్లా, ద్రాక్షారామం గ్రామానికి చెందిన కొమ్మోజు రామకృష్ణ (65) కు వేస్ఫో బాసటగా నిలిచింది. గత నాలుగు నెలలుగా రామకృష్ణ తీవ్రమైన అనారోగ్యం తో బాధ పడుతున్నారు. రాజమహేంద్రవరం ఆసుపత్రిలో పలు వైద్య పరీక్షలు చేయించగా, రెండుమూత్రపిండాలలో సిస్టులు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వాటిని శస్త్రచికిత్స ద్వారా తొలగించాలని, అనంతరం మందులు మరియు చికిత్స కొనసాగించాలని సూచించారు. అనారోగ్యం కారణంగా రామకృష్ణ తన వృత్తిని కొనసాగించలేక పూర్తిగా ఉపాధిని కోల్పోయారు. ఇప్పటి వరకు జరిగిన వైద్య పరీక్షల ఖర్చులను కూడా ఆయన స్నేహితులు, బంధువులే భరించారు.

వారి కుటుంబానికి ప్రస్తుతం రామకృష్ణ భార్య ఇంటి వద్ద టైలరింగ్ చేసి సంపాదించే స్వల్ప ఆదాయమే ఏకైక జీవనాధారం!

రామకృష్ణ శస్త్రచికిత్స, తదుపరి వైద్యం/మందుల కొరకు సుమారు 50,000 రూపాయలు ఆర్థిక సహాయం చేయమని కాకినాడ ఉమ్మడి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి ఆవుపాటి ఉమాశంకర్ ద్వారా రామకృష్ణ కుటుంబం వెస్సో ట్రస్ట్ ను ఆశ్రయించింది. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో రామకృష్ణ భార్య ప్రకాశవేణి కి 51,000 (యాభై ఒక్క వేల రూపాయిలు) అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ కు సహాయం చేసి వారిని సమయానికి ఆదుకొన్న గౌరవ దాతలకు వెస్సో ట్రస్ట్ అధ్యక్షుడు బంగారు తాతారావుధన్యవాదములు తెలిపారు.

## గ్రామాల్లో రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన..

## మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై18 ప్రజాబలం;**వైరా మండలంలోని గండగల పాడు, అష్టగుర్తిగ్రామాల్లో సందర్శించి రైతులకు పంటలపై ఎల్ నినో ప్రభావంపై అవగాహన మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్ కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మంజు ఖాన్ మాట్లాడుతూ..రైతులు ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా వానాకాలం సీజన్లో స్వల్పకాలిక తక్కువ నీటితో అధిక దిగుబడును ఇచ్చే పంట రకాలను ఎంచుకోవాలని సూచించారు. అలానే ప్రత్యామ్నాయ పంటలైన పెసలు, మినుములు, కందులు, జొన్నలు మరియు ఇతర చిరుధాన్యాల పంటలు పండించాలని కోరారు.







ఈ సంవత్సరం భూగర్భ జలాలు అడుగంటి పోవడం జరుగుతుంది కాబట్టి ముందస్తు ప్రణాళికలో భాగంగా వరి మరియు మిర్చికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను వేయాలని వివరించారు. మండలంలో జూలైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో భూగర్భ జలమట్టం తగ్గుతుందని భూగర్భ జలాలు పెంచేలా రైతులు ఫార్మ్పండ్స్ (పంట కుంటలు) ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం వివిజీ రామ్ జీ పథకం ద్వారా 100% రాయితీపై అందిస్తుందని,ఈ ఫార్మ్ పాండ్స్(పంట కుంటలు) పథకాన్ని రైతులందరూ అధిక మొత్తంలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు వెంపటి కీర్తి, మేడా రాజేష్, అష్టపర్తి సర్పంచ్ కంచర్ల అనిత, కంచర్ల వెంకటేశ్వరరావు, గుమ్మ స్వరూప, కంచర్ల నాగేశ్వరరావు, గండగల పాడు గ్రామం రైతులు ఇమ్మడి వీరభద్రం, మల్లేపాటి రామారావు, చిత్తూరు మురళి, ఇమ్మడి సుధీర్, కామినేని రవి, వివిధ గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

## ఖమ్మం 108 జిల్లా అధికారి దుర్గాప్రసాద్‌కు ఘన వీడ్కోలు

## నూతన జిల్లా అధికారిగా ఆలేటి ప్రణయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి జూలై 19:** ఖమ్మం జిల్లా అత్యవసర సేవల విభాగం 108 సర్వీస్ జిల్లా అధికారిగా సేవలందించిన అవులూరి దుర్గాప్రసాద్ బదిలీపై వనపర్తి జిల్లాకు వెళుతున్న సందర్భంగా సత్తుపల్లిలో ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా 108 సర్వీస్ ఉద్యోగులు, 1962 పశుసంచార వాహన సిబ్బంది, 102 అమ్మఒడి వాహన సిబ్బంది, ఉచిత ఎఫ్‌హెచ్‌ఎస్ (ఫ్రీ హియర్స్ సర్వీస్) మార్చురీ వాహన సిబ్బంది పాల్గొని దుర్గాప్రసాద్‌ను సన్మానించి, శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఖమ్మం జిల్లాలో ఎన్నో సంవత్సరాల పాటు అత్యుత్తమ అత్యవసర వైద్య సేవలు అందించి 108 సేవల అభివృద్ధికి విశేష కృషి చేసిన దుర్గాప్రసాద్ సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. మూడు జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ నజీరుద్దీన్, ఖమ్మం జిల్లా 102 అమ్మఒడి అధికారి షేక్ ఇమామ్ పాషా, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల 108 అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఇదే సందర్భంగా ఖమ్మం జిల్లా 108 సర్వీస్ నూతన జిల్లా అధికారి గా ఆలేటి ప్రణయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు తుమ్మా జగదీష్, గొల్లమందల కృష్ణ, ఎర్నం అప్పారావు, కొంద్రు రవి, చాట్ల శ్రీను, ఎంకి శ్రీను, భాస్కర్‌తో పాటు పైలెట్లు సయ్యద్ ఖాద్రి, సీతారాంబాబు, శ్రావణ్, రవి, ఉప్పలయ్య, వంశీకృష్ణ, వీరబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.

## జూలై 20న ప్రజావాణి కార్యక్రమం రద్దు...

## -- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 18(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ఈ నెల 20వ తేదీ (సోమవారం) జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎల్‌నినో ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు,వర్షపాతం, పంటల సాగు,గ్రౌండ్ వాటర్,విద్యుత్, తాగు నీటి సరఫరా,సీజనల్ వ్యాధులనివారణ--నియంత్రణ చర్యలు తదితర అంశాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, అదే రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు,తదుపరి సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు,ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## రెస్టారెంట్లు ఆహార తయారీ యూనిట్లపై ఫుడ్ సేఫ్టీ తనిఖీలు



**పెద్దపల్లి, జూలై-18, ప్రజాబలం ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి గోదావరిఖని పట్టణ పరిధిలోని పలు రెస్టారెంట్లు మరియు ఆహార తయారీ యూనిట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని రాజీవ్ నగర్‌లో ఉన్న ఒక ఆహార తయారీ యూనిట్‌ను తనిఖీ చేయడం జరిగింది. సదరు యూనిట్‌లో ఆలుగడ్డ చిప్స్ మరియు ఇతర స్నాక్స్ పదార్థాల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు.

తనిఖీ సందర్భంగా చిప్స్ తయారీకి ఉపయోగిస్తున్న వంటనూనెను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వంటనూనె నాణ్యతను అక్కడికక్కడే ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన టెస్టింగ్ మీటర్ ద్వారా పరీక్షించగా, దాని రీడింగ్ నిర్దేశిత ప్రమాణాలను మించినట్లు తేలింది. దీంతో సుమారు 25 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడంతో పాటు, ఆ నూనెతో తయారు చేస్తున్న చిప్స్‌ను కూడా అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అంతేకాకుండా, వాడిన వంటనూనెను ఎటువంటి అనధికార సంస్థలు లేదా వ్యక్తులకు విక్రయించరాదని యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు.



ఈ తనిఖీల సందర్భంగా సంబంధిత ఆహార నమూనాలను సేకరించి, తదుపరి విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. ప్రయోగశాల నివేదికల ఆధారంగా అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.అంకిత్ రెడ్డి తెలిపారు.

## రోస్టర్ పాయింట్ల విధానాన్ని పునఃసమీక్షించి తగిన సవరణలను చేయండి

### ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చిన మాల సంఘం ప్రతినిధులు

**పెద్దపల్లి/గోదావరిఖని, జూలై18, ప్రజాబలం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల (ఎస్సీ) కమిషన్ చైర్మన్ కు మాల సంఘం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ గోదావరిఖని అధ్యక్షులు సోగాల వెంకటి, ప్రధాన కార్యదర్శి మద్రి ఐలయ్య ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ త్రీ పరిధిలోని మాల సామాజిక వర్గాలకు రోస్టర్ పాయింట్ల విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని సవరించి ఉద్యోగ విద్యారంగాలలో వారికి రిజర్వేషన్ ప్రయోజనము సక్రమంగా అందేలా రోస్టర్ పాయింట్లను పునః సమర్పించవలసిందిగా విజ్ఞప్తి చేయుట గురించి చైర్మన్ కు వినతిపత్రం ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్ కులాలకు చెందిన 59 ఉప కులాలను ఉద్యోగ విద్యా రంగాలలో రిజర్వేషన్ ప్రయోజనాలు సమాన స్థాయిలో అందించే ఉద్దేశంతో గ్రూప్ వన్ టూ త్రీ మూడు వర్గాలుగా విభజించి ఆయా వర్గాలకు ప్రత్యేక రోస్టర్ పాయింట్లను ప్రభుత్వము రూపొందించిన విషయంలో ఈ వర్గీకరణ వెనుక ఉద్దేశము అన్ని ఎస్సీ ఉపకులాలకు సమాన అవకాశాలు కల్పించడమే అయినప్పటికీ ఆచరణలో గ్రూప్ త్రీ పరిధిలో ఉన్న మాల మరియు అనుబంధ సామాజిక వర్గాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న రోస్టర్ పాయింట్ల విధానము వలన తక్కువ సంఖ్య పోస్టులు గల చిన్న తర ఉద్యోగ నోటిఫికేషన్ లలో గ్రూప్ త్రీ వంతుగా వచ్చే రోస్టర్ పాయింట్లు చాలా సందర్భాలలో వర్తించకపోవడం వలన మాల మరియు అనుబంధ కులాల రిజర్వేషన్లు ద్వారా రావలసిన వాస్తవ ప్రాతినిధ్యము లభించడం లేదనీ, దీని ఫలితంగా అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ రోస్టర్ పాయింట్ సర్దుబాటు లోపం వలన వారికి ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోవుచున్నాయి ఇది రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాల సూత్రానికి అలాగే ఎస్సీ వర్గీకరణ వెనుక ఉన్న న్యాయ సూత్రానికి విరుద్ధంగా ఉందని, గ్రూప్ త్రీ లో అంతర్భాగాలైన మాల దాని అనుబంధ సామాజిక వర్గాలకు ఉద్యోగ విద్య అవకాశాలలో వారికి జనాభా దామాషాకు అర్హత తగిన విధంగా వాస్తవ ప్రాతినిధ్యము లభించే విధముగా ప్రస్తుతము రోస్టర్ పాయింట్ల విధానాన్ని పునః సమీక్షించి తగిన సవరణలను చేయవలసిందిగా కోరారు. ముఖ్యంగా తక్కువ పోస్టులు నోటిఫికేషన్లలో సైతం గ్రూపు త్రీ వర్గానికి రిజర్వేషన్ ప్రయోజనం చేరేలా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించవలసిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి కడప శ్రీహరి, సామాన్య కర్త నంది నరేష్, యువజన నాయకుడు కొండా సురేష్, మాల సంఘం సీనియర్ నాయకులు పిట్టల వెంకటి, నూకల మొండి, ఎరుకల లింగమూర్తి, అందుగుల లింగయ్య, దాసరి కిష్టయ్య, మాదాసి రామ్మూర్తి, వీరితోపాటు మాల సంఘం నాయకులు పాల్గొన్నారు.





# కార్యకర్తలను కంటి పాపల కాపాడుకుంటాం

**. దశదినకర్మలకి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేసిన.**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు**

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 18**తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మంత్రి శ్రీమతి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ,మరియు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు గారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలసి పరామర్శించడం జరిగింది.



ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జబ్బ వెంకటేశ్ కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది శ్రీ కీర్తిశేషులు జబ్బ వెంకటేష్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పుష్పాంజలి ఘటించి,

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు, అనంతరం వెంకటేశ్ గారి భార్య శ్యామంతి ని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తను వారి కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని, కార్యకర్తల కుటుంబాలను కష్టకాలంలో అండగా నిలుస్తుందని తెలిపారు. అలాగే మంత్రి సీతక్క కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటారని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అయోరి యానయ్య, శ్రీ భద్రాచల సీత రామ చంద్ర దేవాలయం ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్,జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్ బాబు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు బాసారి కాని హరికృష్ణ శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్స్ బోడ బురయ్య, బొడ్డు సుధాకర్,యువజన కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎడ్ల నరేష్, మండల యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శులు బిల్పాటి నరేష్, పాయం సతీష్, యూత్ కాంగ్రెస్ మండల ప్రచార కమిటీ కార్యదర్శి మూగల చంటి. మండల యూత్ నాయకులు కబ్బాక లక్ష్మణ్, జనగం భానుచందర్, బాసరికాని నాగార్జున. యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా ఇంచార్జ్ భూక్య కుమార్

# సత్తుపల్లిలో అక్రమ మట్టి దందాపై సమగ్ర విచారణ జరపాలి: బీజేపీ




**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి, జూలై 18:** సత్తుపల్లి పట్టణంలో అక్రమ మట్టి దందా యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భారతీయ జనతా పార్టీ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు విజయ్ ఆరోపించారు.

ప్రతిరోజూ వందల సంఖ్యలో మట్టి లారీలు అనేక ట్రిప్పులు వేస్తున్నా, వాటిని అడ్డుకోవాల్సిన అధికారులే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అక్రమ మట్టి రవాణాకు సంబంధించిన ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, దీంతో అధికారులు మట్టి మాఫియాతో కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.




తనిఖీల సమయంలో మట్టి లారీలు కనిపించకుండా పోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇటీవల నడిరోడ్డుపై మట్టి లారీని అడ్డుకున్నప్పుడు జీపీఓ "తహసీల్దార్ వదిలేయమన్నారు" అని చెప్పగా, ఇదే విషయంపై తహసీల్దార్‌ను ప్రశ్నించగా తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారని విజయ్ వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.అధికారులు మట్టి మాఫియాతో కుమ్మక్కయ్యారా? లేక అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారా? అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని విజయ్ వ్యాఖ్యానించారు. అక్రమ మట్టి రవాణాను అరికట్టేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలకు అధికార యంత్రాంగం సహకరించడం లేదని ఆరోపించారు.సత్తుపల్లిలో జరుగుతున్న అక్రమ మట్టి దందాపై సమగ్ర విచారణ నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన, ఈ అంశంపై ఆధారాలతో కూడిన ఫిర్యాదును త్వరలో ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

# అధిక రుసుము వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు : ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్

**తప్పుగా డాక్యుమెంట్స్ అప్లోడ్ చేస్తే చర్యలు తప్పవు**

**ఇకపై మీ సేవలో డిజిటల్ రశీదులు**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 18 ములుగు** ములుగు మున్సిపాలిటీ పరిది లోని పలు మీసేవ కేంద్రాలను ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, మీసేవ మేనేజర్ విజయ్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు.

కొత్తగా వచ్చిన ఎస్ ఎస్ సి మేమో ప్రింట్, యూరియా బుకింగ్, ఫార్మర్ రిజిస్ట్రేషన్ మరియు వ్యవసాయేతర మార్కెట్ విలువ సర్వీసుల గురించి మీసేవ నిర్వాహకులకు వివరించారు. ఏ విధమైన టెక్నికల్ సమస్యలు వచ్చిన అతి త్వరగా క్లియర్ చేస్తామని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ప్రతి అప్లికేషన్ నమోదు చేయాలని తెలిపారు.

కులం, ఆదాయం, నివాసం, జనన , మరణ కుటుంబ ధృవీకరణ పత్రం, నేటివిటి, గ్యాప్ , నాన్ క్రిమీ లేయర్ వంటి సర్టిఫికేట్లు ఎన్ని సార్లు అయినా తీసుకునే వెసులుబాటు కలదని ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తెలిపారు .

మీసేవ కేంద్రాలను ప్రజలకు ఇప్పుడు అందుబాటులో ఉండి

ఈ ఎస్ డి గైడ్లైన్స్ ప్రకారం మీ సేవ కేంద్రాన్ని నడపవలనని సూచించారు. ఆపరేటర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అన్ని రకాల మీసేవ, భూభారతి మరియు మిగతా ఆన్లైన్ సర్వీస్ లను ప్రజలకు అందించాలని సూచించారు.

మీసేవ సెంటర్లో తప్పకుండా సిటిజెన్ చాప్టర్, భూభారతి కి సంబంధించిన ఫ్లెక్సీలు, మీసేవ లోగో, మరియు తాసిల్దార్, ఈడీఎం, పరిష్కారం కాల్ సెంటర్ల యొక్క ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా ఉండవలెనని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆదేశించారు.

కళ్యాణ లక్ష్మి, (సదరం), బర్త్ మరియు డెత్ సర్టిఫికెట్లు ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని మరియు మీసేవ ఆపరేటర్లు ప్రజల పట్ల సున్నితంగా ఉంటూ వారికి మీసేవ సర్వీసులను మరియు ఇతర అన్ని రకాల ఆన్లైన్ సేవలను అందించాలని ఆదేశించారు.

నిర్ణీత రుసుము కంటే ఎక్కువ రుసుము దరఖాస్తుదారుడు నుంచి తీసుకున్నట్లయితే తప్పనిసరిగా అట్టి మీసేవ సెంటర్ పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తెలిపారు.





అదేవిదంగా రాష్ట్రంలో పౌర సేవలను పారదర్శకంగా వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామ పాలనాధికారులు మరియు రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వినియోగించుకునే విధంగా ప్రత్యేక మొబైల్ అనువర్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై పౌర సేవల దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, రెవెన్యూ సిబ్బంది నివేదికల సమర్పణ తదితర ప్రక్రియ మొత్తం ఆన్లైన్ విధానంలోనే కొనసాగుతుంది . కాగిత రహిత విధానం అమలులోకి రావడంతో సమయానికి సేవలు అందడం, పారదర్శకత పెరగడం జరుగుతుందని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.

ప్రస్తుతం ఆదాయం,కులం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, లేట్ రిజిస్ట్రేషన్ బర్త్ మరియు డెత్, అగ్రికల్చరల్ మార్కెట్ వాల్యూ , గ్యాప్ సర్టిఫికెట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

మీసేవ ద్వారా అప్లై చేస్తే దరఖాస్తు తొలుత గ్రామ రెవెన్యూ పాలనాధికారి(జీపీవో)కి లాగిన్‌లోకి వస్తుంది. ఆయన విచారణ తర్వాత మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్(ఎంఆర్ఐ)కి, తదనంతరం ఆర్ఐ నేరుగా తహసీల్దార్ లాగిన్‌కి చేరవేరుస్తారని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.

అలాగే కొత్త విధానం ప్రకారం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే దరఖాస్తుదారుడికి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ కు ఒక ఎస్ఎంఎస్ వస్తుంది. అందులో అప్లికేషన్ నెంబర్ సర్వీసు పేరు చెల్లించిన ఫీజు వివరాలతో పాటు ఒక హైపర్ లింక్ ఉంటుంది. పౌరులు ఆ లింకు పై క్లిక్ చేసి తమ రసీదును ఎప్పుడైనా వీక్షించవచ్చు డౌన్లోడ్ చేసుకోవచ్చు లేదా ప్రింట్ తీసుకోవచ్చు సర్టిఫికెట్ చేతికి వచ్చేవరకు ఈ ఎస్ఎంఎస్ ను సురక్షితంగా ఉంచుకోవాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ సూచించారు.

దీనివల్ల కాగితాలు పోగొట్టుకునే భయం ఉండదు అలాగే మీసేవ అప్లికేషన్లో సదరు మెసేజ్ తిరిగి పంపించే సౌకర్యాన్ని కల్పించారని ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్ మరియు మీసేవ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకించాలి.. భూగర్భ జలాల పెంపే లక్ష్యం

**వాటర్‌షెడ్ పనులను వేగవంతం చేయాలి.**

**ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఆరు ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేయాలి -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





**జహీరాబాద్, జూలై 18 ప్రజాబలం ప్రతినిధి: సంగారెడ్డి**జిల్లాలో భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక సాగునీటి వనరులు అందుబాటులోకి తీసుకురావాలంటే వర్షపు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించేలా వాటర్‌షెడ్ కార్యక్రమాలను శాస్త్రీయంగా, సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

శనివారం కోహీర్ మండలంలోని సజ్జాపూర్, ఖానాపూర్, బడం పేట గ్రామాల్లో పి యం కె ఎస్ వై పథకం కింద చేపడుతున్న వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు, రీఛార్జ్ బోర్‌వెల్ స్ట్రక్చర్లు, పర్‌కొలేషన్ ట్యాంకులు, మినీ పర్‌కొలేషన్ ట్యాంకులు తదితర వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణాల సామర్థ్యం, వర్షపు నీటి నిల్వ విధానాలపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ప్రతి గ్రామంలో రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని అన్నారు. భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడే రీఛార్జ్ బోర్‌వెల్ స్ట్రక్చర్లు, పర్‌కొలేషన్ ట్యాంకులు, మినీ పర్‌కొలేషన్ ట్యాంకులు, ఫామ్‌పాండ్లు వంటి నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఆరు ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఊట కుంట లేదా పంటకుంట ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కుంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల భూగర్భ జలాలు పునరుద్ధరించబడటంతో పాటు అవసరమైన సమయంలో పంటలకు రక్షణాత్మక సాగునీరు అందుతుందని తెలిపారు.

వాటర్‌షెడ్ కార్యక్రమాల ద్వారా ముఖ్యంగా హార్టికల్చర్ పంటల విస్తరణకు, ఆరుతడి పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే తరహా వాటర్‌షెడ్ అభివృద్ధి పనులను నారాయణఖేడ్, ఆందోల్ జహీరాబాద్, నియోజకవర్గాల్లో కూడా విస్తృతంగ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్శనలో కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ (పీడీ) జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు, సాంకేతిక సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జీ.హెచ్.ఎం.సీ చట్టం 1955 స్థానంలో ప్రతిపాదించిన క్యూర్ బిల్లుపై విశ్లేషణ





**గండిపేట ప్రజాబలం ప్రతినిధి 18 జులై 2026**సీతారాం దూలిపాళ ఆధ్వర్యంలో జరిగిన ది సిటీజన్స కౌన్సిల్ ముఖ్య సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జీ.హెచ్.ఎం.సీ చట్టం 1955 స్థానంలో ప్రతిపాదించిన క్యూర్ బిల్లుపై చర్చ జరిగింది, అందులో ఎకగ్రీవ తీర్మానంగా ముఖ్య అభ్యంతరాలు / సూచనలు క్రింది విధంగా ఉన్నాయి.

ప్రభుత్వం తలపెట్టిన వికేంద్రీకరణ కాస్తా కార్పొరేషన్ ను బలోపేతం చేయాల్సిన దానికి బదులు స్వపరిపాలనను, కార్పొరేషన్ అధికారాలను పరిమితం చేసి అత్యధిక అధికారాలను రాష్ట్ర అపేక్ష కౌన్సిల్ ఆధీనంలో కేంద్రీకరించడం ద్వారా 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం, నిర్ణయాధికారాలను అపేక్ష కౌన్సిల్ వద్ద కేంద్రీకరించడం వల్ల పట్టణ స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తి ఎక మొత్తంగా దెబ్బతింటుంది. ఆర్థిక అధికారాల పై స్పష్టత లేదు: జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లులకు తగిన ఆర్థిక అధికారాల బదలాయింపులు లేవు. అలాగే కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ, మేయర్ తదితర అధికారుల ఆర్థిక అధికారాలపై స్పష్టమైన నిబంధనలు లేకపోవడం వల్ల పరిపాలనలో జాప్యం, బాధ్యతా రాహిత్యం ఏర్పడే అవకాశం మెండుగా ఉంది.

ప్రజా ప్రతినిధుల పాత్రను నిర్వీర్యం చేయడంలో భాగంగా ప్రతిపాదిత వ్యవస్థ పూర్తిగా అధికార యంత్రాంగం ఆధారంగా ఉండి, ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాత్రను విధాన రూపకల్పన, నిర్ణయాలు, అమలు, పర్యవేక్షణ వంటి అంశాలలో గణనీయంగా తగ్గిస్తోంది. వార్డు కమిటీలను తప్పనిసరి చేస్తూ, నెలసరి సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను స్టాండింగ్ కమిటీ మరియు కార్పొరేషన్ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. అట్లాగే పౌర సమాజ సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల నిపుణులు, సామాజిక కార్యకర్తలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలచె ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు కార్పొరేషన్ పరిధిలో ఏర్పడే ఆర్థిక, ప్రణాళిక, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, పర్యావరణం, పారిశుధ్యం తదితర అన్ని కమిటీలలో తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాలి.

ఆస్తి పన్ను సమస్యలకు అసలు పరిష్కారం లేదు: పూర్వ గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి కొనసాగుతున్న ఆస్తి పన్ను అసమానతలకు ఎలాంటి పరిష్కార యంత్రాంగాన్ని బిల్లులో ప్రతిపాదించలేదు. క్యాపిటల్ వ్యాల్యు ఆధారిత పన్ను విధానం మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం మోపుతుంది.

స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల అధికారిక శాఖ మార్గదర్శక విలువలు మరియు వాస్తవ మార్కెట్ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాలను సరిచేయలేదు. పైపెచ్చు రిజిస్ట్రేషన్ ద్వారా ఆస్తుల కొనుగోలు చేసిన పన్ను చెల్లింపుదారులు అధిక స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, సేవా ట్యాక్ష భారం భరించాల్సి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. నీటి సరఫరా మరియు మురుగునీటి ఛార్జీల వార్షిక పెంపు ప్రతి సంవత్సరం స్వయం చాలకంగా పెంచే ప్రతిపాదన ప్రజలపై అనవసర ఆర్థిక భారాన్ని మోపుతుంది. సేవల నాణ్యతకు హామీ లేకుండా ఛార్జీల పెంపు సమంజసం కానే కాదు.

సమన్వయంతో కూడిన వికేంద్రీకృత పరిపాలన ద్వారా క్యూర్ ప్రాంతంలో పనిచేసే అన్ని ప్రభుత్వ శాఖలు, బోర్డులు, కార్పొరేషన్లు, ప్రజా రంగ సంస్థలు మరియు ఇతర ఏజెన్సీలు కార్పొరేషన్‌కు జవాబుదారీగా ఉండాలి. సమర్థవంతమైన, సమన్వయ పూర్వకమైన, ప్రజాకేంద్రిత పట్టణ పరిపాలన కోసం అవన్నీ ఎన్నికైన కార్పొరేషన్ ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణలో పనిచేసే విధంగా చట్టంలో నిబంధనలు ఉండాలి, ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు మరియు ఇతర ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు జాతీయ, రాష్ట్ర మరియు అధికారిక కార్యక్రమాలలో అనుసరించాల్సిన ప్రోటో కాల్‌ను బిల్లులో స్పష్టంగా నిర్దేశించాలి. 74వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి అనుగుణంగా పరిపాలనా, ఆర్థిక మరియు కార్యనిర్వాహక అధికారాలను పట్టణ స్థానిక సంస్థలకు బదలాయించి, నిజమైన స్థానిక స్వపరిపాలనను బలోపేతం చేసే విధంగా క్యూర్ బిల్లును రూపొందిస్తూ, క్యూర్ బిల్లు కేవలం జీ.హెచ్.ఎం.సీ చట్టం 1955 ప్రత్యామ్నాయంగా కాకుండా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణను బలోపేతం చేసే చట్టంగా రూపు దిద్దుకోవాలి. ఎన్నికైన కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు, వార్డు కమిటీలు, పౌర సమాజం పాత్రను పెంపొందిస్తూ, అన్ని పట్టణ సేవల సంస్థలను కార్పొరేషన్‌కు జవాబుదారీగా చేసే విధంగా చట్టంలో నిబంధనలు ఉండాలని, అప్పుడే ప్రజల భాగస్వామ్యంతో కూడిన, పారదర్శకమైన, జవాబుదారీ తనం గల సమర్థవంతమైన పట్టణ పాలన సాధ్యమవుతుందని ది సిటీజన్స కౌన్సిల్ తరపున సీతారాం దూలిపాళ, ఉపేంద్రనాథు రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్ మహమ్మద్, రామ సుబ్బారెడ్డి, విద్యా సాగర్, దిలీపు కక్కడ, బదరీనాథ్, గోపాలకృష్ణ, రామచంద్ర రావు, అను కపూర్, శ్రీధర్ రెడ్డి, నరేష్, సుజాత తది తరులు తెలిపారు.

# దాతల సహకారంతో 1925 రోజులుగా నిరంతర అన్నదానం



వేములవాడ, జూలై 18: మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమం శుక్రవారం 1925వ రోజుకు చేరుకుంది. టీటీడీ ధర్మశాల సమీపంలోని రాజన్న ,భీమేశ్వర ఆలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్నార్తులకు భోజనం వడ్డించారు.నేటి అన్నదాతలుగా కోడం శ్రీ సాయి హర్ష, పెరుక విఘ్నేష్ పటేల్, గుండెల్లి ద్వారకనాథ్ పుట్టినరోజుల సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, అలాగే సిరిసిల్లకు చెందిన కూరపాటి శ్రీధర్ దంపతులు సహకరించారు. శాశ్వత దాతలుగా పలువురు దాతలు తమ వంతు సహాయం అందించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మధు, మహేష్ మాట్లాడుతూ, పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభ సందర్భాల్లో పేదలకు అన్నదానం చేయాలనుకునే దాతలు 92469 39388 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వొద్యాల వేణు, నాగుల చంద్రశేఖర్, పొలాస రాజేందర్, సగ్గు రాహుల్, పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ ను కలిసిన ఖమ్మం జిల్లా జర్నలిస్టులు.




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై18 ప్రజాబలం:**మహబూబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు బాదావత్ శంకర్ నాయక్ స్వీకరించారు.

ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా బ్యూరోలు దేవబత్తిని సీతారాములు, వేము విజయ్, రిపోర్టర్ నాగబత్తిని క్రాంతి కుమార్ రవాణా శాఖ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ ఈ సందర్భంగా జర్నలిస్టు మిత్రులతో తెలుసుకొని ముచ్చడించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఎస్.కె కాసిం సాహెబ్, ఎస్ వెంకట్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వృద్ధురాలి గొంతు కోసి హత్య, బంగారు నగలు అపహరణ.




**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై18 ప్రజాబలం:**ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ సంఘటన చోటు చేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న చెన్న సుగుణమ్మ (60) అనే వృద్ధురాలిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా గొంతు కోసి హత్య చేశారు. కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన భర్త జనార్దన్‌తో కలిసి ఆమె ఇంట్లోనే నివసిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు సుగుణమ్మను హతమార్చి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న భర్తను కంటికి రెప్పలా చూసుకుంటున్న సుగుణమ్మ ఇలా దారుణ హత్యకు గురికావడంతో పిండిప్రోలు గ్రామంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘోరం గురించి తెలుసుకున్న స్థానికులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు

# ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి
## -- కక్షిదారులకు న్యాయమూర్తుల సూచన




**జహీరాబాద్, జూలై 18 ప్రజాబలం ప్రతినిధి:** ప్రత్యేక లోక్ అదాలత్ సందర్భంగా శనివారం స్థానిక కోర్టు ఆవరణలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జి. కవితాదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ అబ్దుల్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి కక్షిదారులకు పలు సూచనలు చేశారు.

రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయమూర్తులు సూచించారు. ఇలా కేసులను రాజీ ద్వారా ముగించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయని తెలిపారు. భూ తగాదాలు, బ్యాంకు రుణాలకు సంబంధించిన వివాదాలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. బాధితులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, జూలై 18 ప్రజాబలం ప్రతినిధి:** అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2,38,500 విలువైన చెక్కులను కోహీర్ మండలానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు శనివారం ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద కుటుంబాలకు అత్యవసర సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనారోగ్య బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

### గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి. సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై18 ప్రజాబలం:**గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారువైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లు సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. సభా వేదికను సుమారు 100 మంది బరువును తట్టుకునే విధంగా నిర్మించాలని, అయితే ప్రోటోకాల్ ప్రకారం డయాస్‌పై సీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే సిద్ధం చేసి, ప్రతి శాఖ అదే ప్రకారం బాధ్యతలు నిర్వహించేలా చూడాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు శాఖ అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని, సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వాహనాలు, వీఐపీ వాహనాలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

గోద్రెజ్ సంస్థ తరఫున కార్యక్రమంలో ప్రసంగించే ప్రతినిధి వివరాలను ముందు గానే ఖరారు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆడియో, వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వీడియోతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలను కార్యక్రమంలో ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు హాజరయ్యేవారందరికీ స్పష్టంగా కనిపించేలా అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి, మంత్రులకు అందించే ఆహార నాణ్యతను ఆహార తనిఖీ అధికారి స్వయంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. కార్యక్రమానికి అవసరమైన సురక్షిత త్రాగునీటినీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు.

ప్రోటోకాల్‌కు అనుగుణంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్యక్రమం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగినంత ఇంధనంతో స్టాండ్‌బై జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సదస్సుకు తరలిన మణికొండ, నేక్నా పూర్ యువత



**గండిపేట ప్రజాబలం ప్రతినిది 18 జులై 2026**భారత రాష్ట్ర సమితి రాష్ట్ర పార్టీ ఆదేశాలకు అనుకూలంగా శనివారం రోజున తలపెట్టిన సరూర్ నగర్ స్టేడియం వేదికగా జరిగిన యువ సంగ్రామ సదస్సుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.ఆర్, బి.ఆర్.ఎస్.ఎల్పీ ఉప నేత సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్ర నగర్ నియోజకవర్గం బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి పిలుపు మేరకు భారీ ఎత్తున తరలి వెళ్లిన మణికొండ, నేక్నా పూర్ డివిజన్ బి.అర్.ఎస్ పార్టీ యువ నాయకులు హాజరై సభను విజయవంతం చేయడం జరిగిందని మాజీ యువాద్యక్షుడు సంగం శ్రీకాంత్ తెలపడం జరిగింది. యూత్ డిక్లరేషన్ పేరుతో యువత నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలని ఎండ గట్టేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని, ఎన్నికల సమయంలో ఇదే సరూర్నగర్ స్టేడియంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీలను కే.టీ.ఆర్ గుర్తు చేస్తూ కాంగ్రెస్ వైఫల్య ప్రభుత్వశీపై ధ్వజమెత్తారు. ఇట్టి సందర్భంగా బాలాజీ, మల్లాపురం శ్రీనివాస్, హుస్సేన్, మహేష్ యాదవ్, శివ, తిరుపతి, ఉదయ్ ప్రశాంత్, మనోజ్, శ్రీకర్, ఆదర్శ్, రవి తదితరు యువ నాయకులు ఈ కార్యక్రమంలో హాజరు కావడం జరిగింది.




## వడ్డెర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా పల్లపు సందీప్



**జహీరాబాద్, జూలై 18 ప్రజాబలం ప్రతినిధి:** వడ్డెర సంక్షేమ సంఘం జహీరాబాద్ నియోజకవర్గ అత్యవసర సమావేశంలో పల్లపు సందీప్‌ను నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించారు. సంగారెడ్డి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు వరికుప్పల లింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ, నియోజకవర్గంలోని వడ్డెర సంక్షేమ సంఘం అభివృద్ధి, ఐక్యత, సభ్యుల సంక్షేమం కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని పల్లపు సందీప్‌కు సూచించారు. సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సభ్యులందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన పల్లపు సందీప్‌కు సంఘం అధ్యక్షుడు పల్లపు అశోక్, సభ్యులు అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# నీట్ ఫలితాలలో వుండ్రు అక్షర సిరికి మెడికల్ సీట్ .

### న్యూ ఎరా న్యూ లిటిల్ ఫ్లవర్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ ఐదుగురికి మెడిసిన్ సీట్లు కళాశాలలో ఆనందోత్సవాలు ..

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై18 ప్రజాబలం:** వైరా కు చెందిన న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాల



విద్యార్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించిన నీట్ 2026 ఫలితాల్లో 20 మంది విద్యార్థుల్లో ఎన్ గోపిక అక్షయ ఎం అరుణ అక్షర సిరి యశ్వంత్ ఏంజిల్ విశేష ప్రతిభ కనబరిచి మెడిసిన్ సీట్లు సాధించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో న్యూఎరా విద్యాసంస్థల చైర్మన్ వి రమణ రావు కరస్పాండెంట్ డాక్టర్పి భూమేష్ రావు డైరెక్టర్ కుర్ర సుమన్ మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి ఐఐటినీట్ వంటి జాతీయ స్థాయి పూర్తి పరీక్షలకు ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అనుభవాలు అయిన అధ్యాపక బృందం నిరంతర పర్యవేక్షణ ప్రత్యేక శిక్షణ ఫలితంగానే విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. వైరా డివిజన్లో కళాశాల ప్రారంభమైన 5 ఏళ్ల గా ప్రతి సంవత్సరం మెడిసిన్ సీట్లు సాధించే విద్యార్థులను అందిస్తున్న ఏకైక కళాశాలగా న్యూ ఇయర్ న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్ నిలుస్తోందని వారు గర్వం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భువన ప్రసాద్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

## తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురవాలని రామాలయంలో వరుణ హోమం -- పాల్గొన్న జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు..



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 18**బితెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్త శనివారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో ములుగు జిల్లా బ్రాహ్మణ పండితులచే నిర్వహించిన పవిత్ర వరుణ హోమంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు పాల్గొన్నారు.

బిఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, చెరువులు, వాగులు, జలాశయాలు నిండి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలని ప్రార్థించారు. అట్లాగే మేడారం లో వనదేవతలను సందర్శించుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ మడుగురి ప్రసాద్, సునారికని శ్రీనివాస్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు

## కరోనా లక్షణాలతో ఏపీలో బాలిక మృతి

కాకినాడ గొల్లప్రోలుకు చెందిన 16 ఏళ్ల బాలిక చెన్నైలో కోవిడ్ లక్షణాలతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీర్ఘకాలిక అనారోగ్యంతో కాకినాడ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఆమెను మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించగా కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. బాలిక మరణంతో స్థానికంగా కలకలం రేగింది. వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి మృతురాలి కుటుంబ సభ్యులకు కోవిడ్ పరీక్షలు నిర్వహించారు

# టీజేఎంయూకు మద్దతు ఇవ్వాలి

## -- ఆర్టీసీ ఉద్యోగులకు నాయకుల పిలుపు



**జహీరాబాద్, జూలై 18 ప్రజాబలం ప్రతినిధి:** త్వరలో జరగనున్న టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘ ఎన్నికల్లో తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ యూనియన్ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, గౌరవాధ్యక్షుడు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ ఆర్టీసీ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శనివారం జహీరాబాద్ డిపోలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వ విలీన అంశంపై 2017 నుంచి టీజేఎంయూ నిరంతరం పోరాటం




చేస్తోందని, ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. విలీనం జరిగితే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజేఎంయూనే కృషి చేస్తోందని, అందువల్ల ఎన్నికల్లో యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పల్లె కృష్ణమూర్తి, రీజినల్ సెక్రటరీ అంజయ్య గౌడ్, డిపో అధ్యక్షుడు జిలాని, కార్యదర్శి నరసింహ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ శశికుమార్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ అనిల్ కుమార్, ఎంఎస్ రెడ్డి జాయింట్ సెక్రటరీ, నరేష్ అసిస్టెంట్ సెక్రటరీలు రాజయ్య గౌడ్, సంయోద్దీన్, పి రాములు ఆర్గనైజ్ సెక్రెటరీ రాజు, పబ్లిసిటీ సెక్రెటరీ ఎండి అశ్వక్, గ్యారేజ్ సెక్రటరీ శ్రావణ్, ట్రెజరర్ ప్రభాకర్, డెలిగేట్స్ మోయిన్, నవీన్ కుమార్, ×ూ రెడ్డి, సంగారెడ్డి డిపో సెక్రటరీ విక్రమ్, జాయింట్ సెక్రెటరీ రవీందర్, సలహాదారులు విట్టల్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్, డెలిగేట్ ఆంజనేయులు, శ్రీనివాస్ మైనార్టీ అధ్యక్షుడు, మైనార్టీ అధ్యక్షుడు వాహిద్ పాషా, యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ




**జహీరాబాద్, జూలై 18 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలోని బాబా నగర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్--టీచర్స్ సమావేశంలో బీజేపీ జహీరాబాద్ టౌన్--2 అధ్యక్షుడు రమేష్ రెడ్డి బసంతపూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాఠశాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహాయం కొనసాగుతుందపాల్గొన్నారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జోగిపేటలో దారుణం

### వంట చేయలేదని 18 రోజుల పసికందును నేలకేసి కొట్టి చంపిన కసాయి తండ్రి





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 18 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** జోగిపేట వాసవి నగర్ కాలనీలో నివసిస్తున్నటువంటి కృష్ణ, గౌరమ్మ,దంపతులకు మగ శిశువు జన్మించాడు, గత కొన్ని రోజుల నుండి వీరి మధ్య గొడవలు ఉండడంతో శుక్రవారం రాత్రి భార్య గౌరమ్మ,వంట చేయలేదని కారణంతో, భర్త కృష్ణ, 18 రోజుల కన్న కొడుకు అని చూడకుండా, పసికందు పై ఉన్మాదిగా మారి దారుణంగా నేలా కేసి కొట్టి చంపేశాడు, సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఘటన స్థలానికి చేరుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకొని, తీవ్రంగా గాయపడిన చిన్నారిని, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే చనిపోయాడు, నిందితున్ని పోలీసులు, అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు....

### ప్రకాశం జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా

ఒంగోలు కామేపల్లి నుండి ఒంగోలు వెళ్లే మార్గంలో ద్వారకా సీఫుడ్స్ వద్ద ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి పల్లెవెలుగు బస్సు బోల్తా పడింది. ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 60 మంది ప్రయాణికులు వున్నారు. ప్రయాణికుల్లో 20 మంది పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు కూడా ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ అక్కడినుంచి పరారైయాడు.

### మహిళపై దాడి కేసులో సీఐపై చర్యలకు ఆదేశాలు

గుంటూరు మహిళపై దాడి కేసులో సీఐపై చర్యలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఫిర్యాదుపై సకాలంలో స్పందించడంలో లోపాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మహిళపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరంపాలెం సీఐ సత్యనారాయణపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు ఎస్పీ వకుల్ జిందాల్ సిఫార్సు చేసారు.

# కన్నులపండువగా వరుణ యాగం

### హాజరైన అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి హరికిషన్

**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 18**రాష్ట్రం, జిల్లా, మండలం సుభిక్షంగా ఉండాలని దూప దీన నైవేద్యం జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో చేపట్టి వరుణయాగం, గణపతి పూజ, గౌరి పూజలు కన్నులపండువగా జరిపించారు

ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో అర్చకులు ఉదయం 9 గంటలకు గణపతి పూజను స్థానిక సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మినర్సింహారావు చేతుల మీదుగా దీపారద చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాడిపంటలు, సంవృద్ధిగా వర్షాలు కురువాలని, సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ప్రత్యేక పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వరుడికి పూజలు చేసి వరుణ యాగం ను వేదపండితులు యల్లాప్రగడ






మణికంటశర్మ, యల్లాప్రగడ రుత్విక్‌సాయిశర్మ పూజలు జరిపించారు.

అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ముగించుకొని వరుణయాగంలో ఏర్పాటు చేసిన జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి బొడ్రాయి అమ్మవారికి అభిషేకం చేసి నూతన వస్త్రాలను అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి హరికిషన్ లు అలంకరించారు. భక్తులతో అమ్మవారికి పుష్పాభిషేకం చేశారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

---- ఐటీ కార్డు పంపిణీ

దూప దీప నైవేద్యం కింద మంజూరైన ఆలయ అర్చకులకు రాష్ట్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి అమరేశ్వర్‌శర్మ, కోశాధికారి హరికిషన్‌లు ఐడీ కార్డులను రామాలయం లో అందజేశారు. రామాలయాన్ని కూడా దూప దీప నైవేద్యం స్కీంలో చేర్చాలని రాష్ట్ర అర్చకులకు ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ విన్నవించారు.

ఆలయం ప్రాగణం, ఆలయ అభివృద్ధి బాగుందని, ఈసారి స్కీంలో పెట్టించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ, సూర్యనారాయణశర్మ, ఏఎన్‌శర్మ, వెంకటరమణచార్యులు, కర్నె సాంబయ్య, ములుగు జిల్లా అధ్యక్షుడు మూడుంబై రాఘునాథచార్యులు, గౌరవ అధ్యక్షుడు పురుషోత్తంచార్యులు, శివ సత్యనారాయణ, వివేవాకనందస్వామి, రామాలయం కమిటీ ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్, కోశాధికారి దీనబాంధవస్వామి, పోగుల లక్ష్మీనారాయణ, కిరణ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్, ములుగు ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, శివాలయం చైర్మన్ మడుగూరి ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ గా ఆమోదించాలి . బిజెపి



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జులై 18**శనివారం ఏటూరునాగారం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు వినుకొల్లు చక్రవర్తి ఆధ్వర్యంలో రెవిన్యూ డివిజన్ కొరకై ధర్నా కార్యక్రమం చేపట్టారు

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు డాక్టర్ జాడి రామరాజు హాజరై మాట్లాడుతూ

ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ 07-10-2 023 నాడు ప్రకటన చేసిన విషయం తెలిసిందే ఇప్పటివరకు ఏటూరు నాగారంలో రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ సిబ్బంది



నియమించలే పేపర్లకు మాత్రమే పరిమితం అయిపోయింది

గౌరవ శ్రీ శ్రీమతి పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేస్తున్న ధనసరి అనసూయ (సీతక్క) +.ూ విడుదల చేసిన తర్వాత కూడా ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ కాకుండా అడ్డుపడుతుంది ఏటూరునాగారం మంగపేట తాడ్వాయి కన్నాయిగూడెం వాజేడు వెంకటాపురం మండల ప్రజలపై ప్రేమ లేదు గిరిజనులు దళితులను వెనుకబడిన ప్రజల మీద ప్రేమ ఉంటే ఈ ప్రాంతం ప్రజలు ఇబ్బంది పడొద్దు అనుకుంటే ఏటూరునాగారం రెవిన్యూ డివిజన్ ఆఫీస్ సిబ్బంది నీ వెంటనే నియమించాలి లేనిచో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలందరూ కలుపుకొని రెవెన్యూ డివిజన్ సాధన కోసం దశలవారీగా కార్యక్రమాలకు ముందుకెళ్తాం

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బర్తరపు నరేష్ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు వావిలాల జనార్ధన్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి గాడిచెర్ల రాజశేఖర్ , మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పలక గంగ, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు గద్దం శ్రీధర్, మండల నాయకులు ఎర్రల ఎల్లయ్య , మండల ఉపాధ్యక్షులు యానాల చంద్ర రెడ్డి, బొల్లె శ్రీను, మండల కార్యదర్శిలు కందకట్ల రమేష్, దుర్గం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com